ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు





Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 203 శనివారం 11 - 07 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 203 Saturday 11 - 07 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## భద్రాద్రి రామయ్య మీద ఒట్టు
# మళ్లీ మాదే అధికారం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రైతు ఆశీర్వాద సభలో రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- బహిరంగ సభలో కీలక వ్యాఖ్యలు
- 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం జోస్యం
- అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి
- పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని వివరణ
- జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే బీఆర్ఎస్‌కు సవాల్



**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 10 :** వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2029 మే, జూన్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు ఆమోదించుకునేందుకు బీజేపీ యత్నిస్తోందన్న రేవంత్ రెడ్డి, అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు, పార్లమెంట్ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయని వెల్లడించారు. భద్రాచలం రాముడి మీద ఒట్టు, వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కేసీఆర్, అతని బంధువులు, దొంగ సర్వేలను ఓడిస్తామని సవాల్ చేశారు. ప్రతిపక్షాలను ఓడించేందుకు రోజూ 18 గంటలు పని చేస్తామని, కేసీఆర్ - మిగతా 2 లో

## 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం'
# ఎలా ఉంటుందో చూపిస్తా



- తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత
- తమ ప్రభుత్వం వస్తే రైతును రాజును చేస్తానన్న కవిత
- పాంచజన్యం అనే నినాదంతో ముందుకు సాగుతామని వెల్లడి
- గిరిజనుల హక్కుల సాధన కోసమే పార్టీ పెట్టానన్న కవిత

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 10 :** తెలంగాణ రక్షణ సేన ఎన్నికల్లో విజయం సాధిస్తే 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో రుచి చూపిస్తానని ఆ పార్టీ అధ్యక్షురాలు కవిత అన్నారు. రైతును నిజమైన రాజును చేస్తానని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే ప్రతి ప్రభుత్వ ఆఫీసులో రైతులకు ప్రత్యేక - మిగతా 2 లో



# కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు

- ఎంపీ ఈటల రాజేందర్
- నాకు తెలంగాణే మొదటి ప్రాధాన్యం.. ఆ తర్వాతే పార్టీ అన్న ఈటల
- ప్రభుత్వం వెంటనే మోటార్లు ఆన్ చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్
- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని తప్పుబట్టడం దుర్మార్గమని కాంగ్రెస్‌పై విమర్శలు

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 10 :** ప్రజల ప్రయోజనాల విషయంలో తనకు తెలంగాణే మొదటి ప్రాధాన్యమని, ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగత అంశాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తాను ఎవరో చెప్పినట్లు మాట్లాడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. సాగునీటి నిర్వహణ, కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుల - మిగతా 2 లో

# భారత తొలి హైడ్రోజన్ ట్రైన్‌కు రైల్వే శాఖ ఆమోదం

- జింద్- సోనిపత్ మధ్య డైలీ హైడ్రోజన్ రైలు సర్వీసును ప్రవేశపెట్టడానికి రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం
- 74010/74009 రైలు నంబర్లతో ఈ సర్వీసు
- ఇప్పటికే జూన్‌లో దిల్లీ- జింద్ మధ్య హైడ్రోజన్ రైలు ట్రయల్ రన్ పూర్తి



**వార్త సంధ్య,ఢిల్లీ, జులై 10 :** భారతదేశపు తొలి హైడ్రోజన్ రైలు త్వరలోనే పట్టాలు ఎక్కనుంది. జింద్- సోనిపత్ మధ్య డైలీ హైడ్రోజన్ రైలు సర్వీసును ప్రవేశపెట్టడానికి రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు సంబంధిత వర్గాలు తెలిపాయి. 74010/74009 రైలు నంబర్లతో ఈ సర్వీసు నడుస్తుందని చెప్పాయి. జింద్ సిటీ, పాండు పిండారా, లలిత్ ఖేడా, భంబేవా, ఇషాపుర్ ఖేరి, బుటానా, ఖంద్రాయ్, గోహానా, రభ్రా, లాత్, మోహనా, హరియాణా, బర్వాస్ని స్టేషన్లలో వాణిజ్యపరమైన స్టాపులు ఉంటాయని వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే జూన్‌లో దిల్లీ- జింద్ మధ్య హైడ్రోజన్ రైలు ట్రయల్ రన్ పూర్తి - మిగతా 2 లో

## ఈ20 పెట్రోల్‌తో మైలేజ్ 3-5% తగ్గొచ్చు
# కానీ లాభాలు ఎన్నో




- అధిక ఆక్టేన్, మెరుగైన పికప్ వంటి ప్రయోజనాలు ఉన్నాయని వివరణ
- ఈ20 అమలుకు ముందు ఆటో కంపెనీలతో సంప్రదింపులు జరిపామని వెల్లడి
- ఈ20 వల్ల వాహనాలకు నష్టం జరిగిందన్న ఆధారాలు లేవన్న కేంద్రం
- ఈ20తో కార్బన్ ఉద్గారాలు సుమారు 40 శాతం వరకు తగ్గుతాయని వెల్లడి

**వార్త సంధ్య,ఢిల్లీ, జులై 10 :** ఈ20 (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) వినియోగంతో కొన్ని వాహనాల్లో మైలేజ్ 3-5 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే మైలేజ్‌ను మాత్రమే ప్రమాణంగా చూడకూడదని, ఈ20 వల్ల అనేక కీలక ప్రయోజనాలు లభిస్తాయని స్పష్టం చేసింది. ఈ20 పెట్రోల్‌కు సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే అధిక ఆక్టేన్ రేటింగ్, మెరుగైన యాంటీ-నాక్ లక్షణాలు ఉంటాయని పేర్కొంది. దీంతో ఇంజిన్ పనితీరు మెరుగుపడటంతో పాటు వాహనానికి మంచి పికప్, సాఫీ యాక్సిలరేషన్, శుభ్రమైన ఇంజిన్ నిర్వహణ వంటి ప్రయోజనాలు కలుగుతాయని వెల్లడించింది. ఈ20 అమలుకు ముందే ఆటోమొబైల్ తయారీ సంస్థలు, విడిభాగాల తయారీదారులు, పరిశోధనా సంస్థలతో విస్తృతంగా చర్చలు జరిపినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంజిన్ పనితీరు, - మిగతా 2 లో

## అమర్‌నాథ్ యాత్రకు
# పోటెత్తిన భక్తులు

- 1.60 లక్షలు దాటిన దర్శనాలు
- అమర్‌నాథ్ యాత్రలో 1.60 లక్షలు దాటిన భక్తుల దర్శనాలు
- జమ్మూ నుంచి కశ్మీర్‌కు బయల్దేరిన మరో 8,796 మంది యాత్రికులు
- గత ఏడాదితో పోలిస్తే భక్తుల సంఖ్య పెరిగిందన్న లెఫ్టినెంట్ గవర్నర్




**వార్త సంధ్య,ఢిల్లీ, జులై 10 :** అమర్‌నాథ్ యాత్ర-2026కు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ ఏడాది యాత్ర ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు 1.60 లక్షల మందికి పైగా భక్తులు పవిత్ర గుహలో మంచు లింగాన్ని దర్శించుకున్నారు. యాత్ర సజావుగా కొనసాగుతున్న నేపథ్యంలో ఇవాళ జమ్మూలోని భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి 8,796 మంది యాత్రికులతో కూడిన తొమ్మిదో బృందం కశ్మీర్ లోయకు బయల్దేరింది. ఈ బృందంలో 3,350 మంది బల్తాల్ బేస్ క్యాంపునకు, మరో 5,346 మంది పహల్గామ్ బేస్ క్యాంపునకు ప్రత్యేక భద్రతా కాన్వాయ్‌ల నడుమ వెళ్లారు. యాత్రికులలో 6,426 - మిగతా 2 లో

## చైనా మెగా డ్యామ్‌కు సొంత
# శాస్త్రవేత్తల హెచ్చరిక

- పొంచివున్న పెను ప్రమాదం!
- బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మిస్తున్న మెగా డ్యామ్‌కు ముప్పు
- క్రియాశీలక ఫాల్ట్ లైన్‌పై డ్యామ్ నిర్మాణం జరుగుతోందని వెల్లడి
- భూకంపాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరిక
- భారత్, బంగ్లాదేశ్‌పై తీవ్ర ప్రభావం పడుతుందన్న ఆందోళనలు



## ఏపీలో మళ్లీ కరోనా కలకలం

- కడప, రాజంపేటల్లో కోవిడ్ లక్షణాలతో ఇద్దరి మృతి!
- ఏపీలో మళ్లీ కలకలం రేపుతున్న కరోనా
- తీవ్ర కరోనా లక్షణాలతో చికిత్స పొందుతూ ఇద్దరి మృతి
- ప్రైమరీ కాంటాక్ట్స్ వివరాలను సేకరిస్తున్న మెడికల్ టీమ్స్

**వార్త సంధ్య, అమరావతి, జులై 10 :** ప్రపంచాన్ని ఒకప్పుడు వణికించిన కరోనా వైరస్ ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ కలకలం రేపుతోంది. తాజాగా కడప జిల్లాలో కోవిడ్ తరహా లక్షణాలతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందడం స్థానికంగా - మిగతా 2 లో

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం

- చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయాలు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ
- కీలక నిర్ణయాలకు ఆమోదం
- సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- రూ.31,431 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం
- అమరావతిలో భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు పెంపు.. కీలక నిర్ణయం



**వార్త సంధ్య, అమరావతి, జులై 10 :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, సోషల్ మీడియా నియంత్రణ వంటి అనేక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం, దానిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోబోతోందని ఆయన స్పష్టం చేశారు.

**సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం**

సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాలపై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రుతిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు. రాష్ట్ర స్థాయిలో ఒక - మిగతా 2 లో

# అమరావతికి 'శాంసంగ్ సిటీ'

- కొరియా కంపెనీలతో మంత్రి లోకేశ్ కీలక భేటీలు
- ఏపీలో బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు డెల్టా ఎక్స్‌కు ఆహ్వానం
- అమరావతిలో 'శాంసంగ్ సిటీ'కి లోకేశ్ ప్రతిపాదన
- ప్రతిపాదనలను ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామన్న శాంసంగ్ ప్రతినిధులు



**వార్త సంధ్య, అమరావతి, జులై 10 :** ఆంధ్రప్రదేశ్‌ను అత్యాధునిక సాంకేతికత, పారిశ్రామిక పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తన దక్షిణ - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఏనాటి బంధమో ఇది..!



స్వదేశంలో నెహ్రూను తీవ్రంగా విమర్శించే ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ఇండోనేషియా పార్లమెంట్‌ను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో భారత తొలిప్రధాని పేరు ప్రస్తావించారు. ఏ మాత్రం కష్టపడకుండా ఇండోనేషియా అత్యున్నత గౌరవపురస్కారాన్ని మోదీ దక్కించుకున్నారన్న అర్థంవచ్చేలా కాంగ్రెస్ ఓ విమర్శ చేసింది కానీ, ఉభయదేశాల సంబంధాలకు పునాదిపడిన అలనాటి రోజులనూ, అప్పటి పరిస్థితులను కాస్తంతైనా ప్రస్తావించకుండా, కారకుడైన నెహ్రూను స్మరించకుండా వర్తమానంలో బలమైన బంధం నెలకొల్పడం సాధ్యం కాదని మోదీకి తెలుసు. ఆయన తన ప్రసంగంలో బాండుంగ్ కాన్ఫరెన్సు గురించీ, అలీన విధానానికి సుకర్ణో--నెహ్రూల బలమైన పునాదుల గురించి ప్రస్తావించారు. రెండేళ్ళ తేడాలో స్వాతంత్ర్యాన్ని పొందిన ఈ రెండు దేశాలూ తమ వలసవాద వ్యతిరేక పోరాటంతో అనేక దేశాలకు స్ఫూర్తినిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆగస్టు 17, 1945లో డచ్ పాలననుంచి ఇండోనేషియా స్వాతంత్ర్యం ప్రకటించుకోగానే, ప్రధాని సుతాన్ జహ్రీర్, ఉపాధ్యక్షుడు మహ్మద్ హట్టాలను డచ్‌సైన్యం గృహనిర్బంధంలో ఉంచితే, భారత వైమానిక దళంలో పైలట్‌గా పనిచేస్తున్న బిజూ పట్నాయక్, కోపైలట్ అయిన తన భార్య జ్ఞానవతీ పట్నాయక్‌తో కలిసి ఒక డకోటా విమానంలో ఇండోనేషియా వెళ్ళి వారిని రక్షించిన ఘట్టాన్ని కూడా మోదీ గుర్తుచేశారు. నెహ్రూ ఆదేశాల మేరకు బిజూభాయ్ అత్యంత సాహసోపేతంగా ఈ కర్తవ్యాన్ని పూర్తిచేసిన విషయం తెలిసిందే. డచ్‌తో ఇండోనేషియా తీవ్రంగా పోరాడుతున్న ఆ కాలంలో, అక్కడ నిర్బంధంలో ఉన్న ఈ ఇండోనేషియా కీలకనేతలిద్దరినీ రక్షించే క్రమంలో విమానాన్ని కూల్చివేస్తామన్న డచ్ సైన్యం హెచ్చరికలను సైతం బిజూ పట్నాయక్ లక్ష్యపెట్టలేదు. తన ఈ చిన్న విమానానికి ఏ మాత్రం హాని జరిగినా దానిని భారతదేశం మీద దాడిగా భావిస్తామని బెదిరించి మరీ ఆ నేతలిద్దరినీ సింగపూర్ మీదుగా ఢిల్లీ చేర్చారు బిజూభాయ్. 1950లో భారతదేశ తొలి గణతంత్ర దినోత్సవానికి ఇండోనేషియా తొలి అధ్యక్షుడు సుకర్ణో ముఖ్య అతిథిగా విచ్చేయడం ఇరుదేశాల స్నేహబంధానికి నిదర్శనమని మోదీ వ్యాఖ్యానించారు. సుకర్ణో కుమార్తెకు మేఘావతి అని నామకరణం చేసింది కూడా బిజూ పట్నాయకేనని అంటారు. ఇండియా--ఇండోనేషియా బంధానికి ఉన్న బలమైన పునాదిని వివరించే క్రమంలో కొన్ని ఉద్దేశపూర్వకమైన విస్మరణలు జరిగినప్పటికీ, ఎనిమిది దశాబ్దాలనాటి ఆ సంఘటనలను ఉపరితలంలోనైనా ప్రస్తావించినందుకు మోదీని అభినందించాల్సిందే.ఇండోనేషియా పార్లమెంట్‌ను ఉద్దేశించి భారతప్రధాని ప్రసంగించడం ఇదే తొలిసారి. ఉభయదేశాల భాగస్వామ్యంలో ఒక సువర్ణ అధ్యాయం ఆరంభమవుతోందన్నారు మోదీ. భారతప్రధాని పర్యటనలో యుద్ధవిమానాలు, ఎర్రతివాచీల స్వాగతాల నుంచి అడుగడుగునా ఆ దేశం కనబరచిన గౌరవం బలమైన పునాదికి నిదర్శనం. నరేంద్రమోదీ తనకు ఆదర్శమనీ, ఆయన పథకాలను కాపీకొడతానని చమత్కరించి మరీ ఎంతో ఆత్మీయతను ప్రకటించారు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబవో సుబియాంతో. ఆపరేషన్ సిందూర్‌లో కీలకపాత్ర పోషించిన 'బ్రహ్మోస్', 'అస్త్ర' క్షిపణుల కొనుగోలుకు ఇండోనేషియా నిర్ణయించుకోవడం విశేషమైన పరిణామం. దాదాపు ఎనిమిదేళ్ళుగా చర్చోపచర్చలు జరుగుతూ, సైనికరంగ ప్రముఖుల రాకపోకలు సాగుతూవచ్చిన అంశమిది. రక్షణలోనే కాదు, నౌకాయానం, కీలక ఖనిజాలు,అంతరిక్షం, ఆహారభద్రత, ఔషధాలు ఇత్యాది చాలా రంగాల్లో సహకారం మెండుగా ఉండబోతోంది. అండమాన్--నికోబార్ దీవులకు సమీపంగా ఉన్న సబాంగ్ ఓడరేవును ఉమ్మడిగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదన వ్యూహాత్మకంగా ఉపకరిస్తుంది. ఇండోనేషియా చెల్లింపుల వ్యవస్థతో మన యూపీఐ అనుసంధానం ఆర్థికబంధంలో కీలకమైన అడుగు. రెండుదేశాల తీరరక్షకదళాలు సమష్టిగా పనిచేయాలన్న నిర్ణయం మన భద్రతకు ఉపకరిస్తుంది. హిందూమహాసముద్రాన్ని పసిఫిక్ మహాసముద్రంతో కలిపే నాలుగు జలసంధుల మధ్య ఇండోనేషియా ఉన్నందున ఒక వ్యూహాత్మక భాగస్వామిగా దాని సహకారం మనకు ఎంతో అవసరం. నికెల్ నిలువలు అత్యధికంగా ఉన్న ఈ దేశంతో ఉత్పత్తి, శుద్ధి, ఎగుమతుల విషయంలో ఇచ్చిపుచ్చుకోవడం మన విద్యుత్ వాహనాల తయారీకి తోడ్పడుతుంది. మోదీ పర్యటనలో కుదిరిన పద్నాలుగు ఒప్పందాలూ అవగాహనలూ ఉభయదేశాల మధ్యా సాన్నిహిత్యాన్నీ సహకారాన్నీ మరింత పెంచుతాయి.

## భారత తొలి హైడ్రోజన్ ట్రైన్‌కు రైల్వే శాఖ ఆమోదం

**మొదటిపేజీ తరువాయి -** చేశారు. ఇందులో అత్యవసర బ్రేకింగ్ దూరం, రైలు డోలనం వంటి కీలక అంశాలపై దృష్టి సారించారు.

## ఈ20 పెట్రోల్‌తో మైలేజ్ 3-5% తగ్గొచ్చు.. కానీ లాభాలు ఎన్నో

**మొదటిపేజీ తరువాయి -** ఇంధన వ్యవస్థ, మన్నిక, ఉద్గారాలు, ఇంధన సామర్థ్యం వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ20 అమలు చేపట్టినట్లు పేర్కొంది.వాహన తయారీ సంస్థలు పూర్తిగా సంతృప్తి చెందకపోతే ఈ20కు మద్దతు ఇచ్చేవి కాదని, వాహనాల వారంటీలను కూడా కొనసాగించేవి కాదని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం దాదాపు అన్ని కంపెనీలు పాత, కొత్త వాహనాలకు వారంటీ ఇస్తుండటమే దీనికి నిదర్శనమని పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మారుతీ సుజుకీ 2.84 కోట్ల వాహనాలకు సర్వీసింగ్ చేయగా, అందులో 1.5 కోట్ల పాత ఈ20 సర్టిఫికేషన్ లేని వాహనాలు కూడా ఉన్నాయని తెలిపింది. అయినప్పటికీ ఈ20 కారణంగా తుప్పు పట్టడం, విడిభాగాలు దెబ్బతినడం లేదా అసాధారణ అరుగుదల వంటి సమస్యలు ఏవీ గుర్తించలేదని వెల్లడించింది. హీరో మోటోకార్ప్ కూడా ఇదే తరహా అనుభవాన్ని నివేదించినట్లు తెలిపింది.అలాగే ఈ20 వాడకంతో సూక్ష్మ రేణువుల ఉద్గారాలు చాలా తక్కువగా ఉంటాయని, మొత్తం కార్బన్ ఉద్గారాలు సుమారు 40 శాతం వరకు తగ్గుతాయని కేంద్రం పేర్కొంది. ఇథనాల్ ఉత్పత్తి, నిల్వ, రవాణా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రతి ఏడాది సుమారు రూ.లక్ష కోట్ల మేర పెట్టుబడులకు రుణాలు అందిస్తున్నాయని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చూపిస్తా



**మొదటిపేజీ తరువాయి -** గౌరవ కుర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళల కోసం ఒక వినూత్న ఆలోచన చేశామని... త్వరలోనే దాని వివరాలు ప్రకటిస్తానని చెప్పారు. 'పాంచజన్యం' అనే నినాదంతో మార్పు కోసం ముందుకు సాగుతామని పేర్కొన్నారు .భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావు పేట మండలంలోని కొత్త గంగారం తదితర ఆదివాసి గ్రామాల్లో పర్యటించిన కవిత, స్థానికుల జీవన విధానాన్ని, సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వెనకబడిన గిరిజనుల హక్కుల సాధన కోసమే తాను తెలంగాణ రక్షణ సేనను స్థాపించానని, ఇక్కడికి వచ్చింది రాజకీయాల కోసం కాదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనని స్పష్టం చేశారు. 1950 రికార్డుల్లో నాయకపోడు తెగ పేరు లేకపోవడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల హక్కుల సాధనకై అవసరమైతే ఢిల్లీ వేదికగా పోరాడతామన్నారు. కార్పొరేట్ శక్తుల వేల కోట్ల అప్పులు మాఫీ చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... ఆదివాసి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంక్ లోన్లు ఎందుకు ఇవ్వడం లేదని కవిత నిలదీశారు. విదేశాల తరహాలోనే ఇక్కడి గిరిజనులకు కూడా రూ.2 లక్షల నుండి రూ.2 కోట్ల వరకు సులభంగా లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆరోపించిన ఆమె, ఆదివాసి పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించడం వారి ప్రాథమిక హక్కు అని గుర్తుచేశారు. ఏది సాధించాలన్నా ముందు ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుందని... అందరి సహకారం తనకు కావాలని కోరారు.

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం

**మొదటిపేజీ తరువాయి -** 'సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్' ఏర్పాటు.

దుర్వినియోగం, విద్వేష ప్రచారాలను అరికట్టేందుకు 'రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు.

విద్వేషాలు వ్యాప్తి చేసే హ్యాండిల్స్‌ను గుర్తించడానికి ఆధునిక ఫొరెన్సిక్ టూల్స్ కొనుగోలుకు నిధులు.

సోషల్ మీడియా కేసుల దర్యాప్తుపై ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ, సైబర్ పరిజ్ఞానం ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పీపీల) నియామకం.ఇతర దేశాల్లోని చట్టాలను అధ్యయనం చేసి, అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకురావడంపై పరిశీలన.రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు.అమరావతికి సంబంధించి కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు ఊరట కల్పిస్తూ వార్షిక కౌలును పెంచింది. జూన్ 12, 2024 తర్వాత ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూములు ఇచ్చిన రైతులకు ఈ పెంపు వర్తిస్తుంది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30,000 నుంచి రూ.40,000కు, జరీబు భూములకు రూ.50,000 నుంచి రూ.60,000కు వార్షిక కౌలును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి 10 సంవత్సరాల పాటు ఈ కౌలు చెల్లిస్తారు. అలాగే, గ్రామ కంఠాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చే నెలవారీ పరిహారాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతూ 12 నెలల పాటు అందించాలని తీర్మానించారు. వీటితో పాటు, అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ వంటి సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా, నేషనల్ ఫిషరీస్ బోర్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో అక్వేరియం, ఆర్నమెంటల్ ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది.సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, పేద విద్యార్థులను ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు.సాగు, తాగునీటి ప్రాజెక్టులపై కేబినెట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. పెద్దగడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఐదుసార్లు టెండర్లు విఫలమైన నేపథ్యంలో, 14.88 శాతం ఎక్కువకు కోట్ చేసిన టెండర్‌ను ఆమోదించింది. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి చెరువులకు నీటిని అందించే పనులకు రూ.67.98 కోట్లకు పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా 'జలధార' కార్యక్రమం పురోగతిని సమీక్షించాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీరు, పశుగ్రాసంపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గుంటూరు జిల్లా పుల్లడిగుంట గ్రామంలో దశాబ్దాలుగా నివసిస్తున్న 200 కుటుంబాలకు ఊరట కల్పిస్తూ, వారు నివసిస్తున్న 10.16 ఎకరాల 'తోపు పోరంబోకు' భూమిని పట్టా భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇలాంటి భూ వర్గీకరణ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేలాది కుటుంబాలకు న్యాయం చేస్తామని, మార్చి 2027 నాటికి పరిష్కరించగల అన్ని రెవెన్యూ సమస్యలను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారని మంత్రి పేర్కొన్నారు.కాగా, ఈ కేబినెట్ సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ గైర్హాజరయ్యారు. పవన్ భుజం శస్త్రచికిత్స కోసం ముంబై వెళ్లనున్న నేపథ్యంలో ఆయన నేటి సమావేశానికి దూరంగా ఉన్నారు. ఇక, ఐటీ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ ప్రస్తుతం దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే.

# అమరావతికి 'శాంసంగ్ సిటీ'

**మొదటిపేజీ తరువాయి -** కొరియా పర్యటనలో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) తయారీలో పేరొందిన డెల్టా ఎక్స్, ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ కంపెనీల ఉన్నతాధికారులతో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. ఏపీలో భారీ ఎత్తున తయారీ, పరిశోధన యూనిట్లను స్థాపించాలని ఆయన ఈ కంపెనీలను ఆహ్వానించారు. సియోల్‌లో డెల్టా ఎక్స్ ఫౌండర్, సీఈవో స్టీఫెన్ కిమ్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ, 25 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టుల లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ ప్రణాళికలకు అనుగుణంగా రాష్ట్రంలో సోలార్ మాడ్యూళ్లు, బ్యాటరీ సెల్స్ తయారీకి అనువైన పర్యావరణాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. పోర్టులు, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్న ఏపీలో ఒక బీఈఎస్ఎస్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డెల్టా ఎక్స్‌ను కోరారు. దీనికి డెల్టా ఎక్స్ సీఈవో స్టీఫెన్ కిమ్ సానుకూలంగా స్పందించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో తయారీ యూనిట్ ఏర్పాటుపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆయన మంత్రికి తెలిపారు.

### శాంసంగ్‌కు భారీ ప్రతిపాదనలు

అనంతరం, ప్రపంచ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ జో యున్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తూ పలు ప్రతిపాదనలు చేశారు.ఏఐ, డేటా సెంటర్ హబ్: రాష్ట్రంలోని 10 గిగావాట్ల డేటా సెంటర్ పైప్‌లైన్‌ను ఉపయోగించుకుని, ఏఐ-కంప్యూట్, సర్వర్ తయారీ, సర్వీసింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌ను శాంసంగ్‌కు ప్రధాన కేంద్రంగా మార్చాలని లోకేశ్ కోరారు.తయారీ యూనిట్లు: ఏపీలో ఒక డిస్‌ప్లే ఫ్యాబ్, విశాఖపట్నంలోని ఐఎస్ఎం ఓఎస్ఏటీ క్లస్టర్‌ను ఆధారంగా చేసుకుని కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, మొబైల్స్ కోసం ఒక సెమీకండక్టర్ యూనిట్ (ఓఎస్ఏటీ) ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, రాష్ట్ర పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు మద్దతుగా మొబైల్, డివైస్ బ్యాటరీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.అమరావతిలో భాగస్వామ్యం: రాజధాని అమరావతి నిర్మాణం, పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనలో శాంసంగ్ భాగస్వామి కావాలని ఆహ్వానించారు. అమరావతి క్వాంటం వ్యాలీలో శాంసంగ్ ఆర్‌డడీ విభాగాన్ని నెలకొల్పాలని సూచించారు.శాంసంగ్ సిటీ: వీటన్నిటికీ మించి శాంసంగ్ బహుళ విభాగాలకు ఒకేచోట నిలయంగా ఉండేలా ఏపీలో ఒక ప్రత్యేక 'శాంసంగ్ సిటీ'ని నిర్మించాలన్న భారీ ప్రతిపాదనను కూడా లోకేశ్ వారి ముందుంచారు.మంత్రి లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదనలపై శాంసంగ్ ప్రతినిధులు స్పందిస్తూ, తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని తెలిపారు. మొత్తం మీద, గ్రీన్ ఎనర్జీ, హై-టెక్ తయారీ రంగాలలో కొరియా దిగ్గజాలను ఏపీకి ఆకర్షించేందుకు మంత్రి లోకేశ్ చేసిన ఈ ప్రయత్నాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా డెల్టా ఎక్స్ నుంచి సానుకూల స్పందన రావడం రాష్ట్రానికి శుభపరిణామంగా భావిస్తున్నారు.

# చైనా మెగా డ్యామ్‌కు సొంత శాస్త్రవేత్తల హెచ్చరిక

**మొదటిపేజీ తరువాయి -** బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ స్థాయిలో నిర్మిస్తున్న మెగా హైడ్రోపవర్ ప్రాజెక్టు భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ డ్యామ్ నిర్మాణ ప్రాంతం కింద ఒక క్రియాశీలక ఫాల్ట్ లైన్ (భూఫలకల మధ్య పగులు) ఉన్నట్లు చైనాకు చెందిన జియాలజిస్టులే స్వయంగా హెచ్చరించారు. దీనివల్ల ఆ ప్రాంతంలో భూకంపాలు సంభవించే, కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉందని వారి అధ్యయన నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక గత నెలలో ప్రచురితమైంది.టిబెట్‌లోని యార్లుంగ్ త్సాంగ్పో నదిపై (భారత్‌లోకి ప్రవేశించిన తర్వాత బ్రహ్మపుత్రగా పిలుస్తారు) ఈ భారీ డ్యామ్ నిర్మాణాన్ని చైనా 2025లో ప్రారంభించింది. ఇది పూర్తయితే ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుగా నిలవనుంది. చైనాలోని త్రీ గోర్జెస్ డ్యామ్ కంటే మూడు రెట్ల అధికంగా, ఏటా సుమారు 300 బిలియన్ కిలోవాట్ గంటల విద్యుత్‌ను ఇది ఉత్పత్తి చేస్తుందని అంచనా వేస్తున్నారు.చైనా జియోలాజికల్ సర్వే ఆధ్వర్యంలో చెంగ్డూ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ నిపుణులు ఈ అధ్యయనం నిర్వహించారు. డ్యామ్ నిర్మిస్తున్న ప్రాంతంలో 'పైజెన్ ఫాల్ట్' అనే ఫాల్ట్ లైన్ ఉందని, ఇది నిరంతరం కదులుతూ ఉండటం వల్ల అక్కడి శిలలు బలహీనపడ్డాయని వారు గుర్తించారు. డ్యామ్‌లో నీటిని నింపినప్పుడు లేదా భూకంపం సంభవించినప్పుడు కొండచరియలు విరిగిపడే ముప్పు అధికంగా ఉంటుందని నివేదికలో స్పష్టం చేశారు. హిమాలయ పర్వత శ్రేణుల్లోని ఈ ప్రాంతం సహజంగానే భూకంపాల ప్రభావానికి ఎక్కువగా గురవుతుందని వారు గుర్తుచేశారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్‌కు బ్రహ్మపుత్ర నది ప్రధాన జీవనాధారం. ఈ నదిపై చైనా చేపడుతున్న ప్రాజెక్టుల వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని, పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని భారత్ చాలాకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తోంది. తాజా భౌగోళిక అధ్యయన నివేదిక వెలువడటంతో ఈ ఆందోళనలు మరింత తీవ్రమయ్యాయి.

## ఏపీలో మళ్లీ కరోనా కలకలం

**మొదటిపేజీ తరువాయి -** తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.వివరాల్లోకి వెళితే... జిల్లాలో ఇటీవల కొందరికి అనుమానంతో చేసిన ఆర్టీపీసీఆర్ పరీక్షల్లో ఐదుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఇదిలా ఉండగా, కడప నగరంతో పాటు రాజంపేట ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్రమైన కరోనా లక్షణాలతో బాధపడుతూ, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.ఒకేసారి ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. కడప, రాజంపేటల్లోని బాధిత ప్రాంతాలలో స్పెషల్ మెడికల్ టీమ్స్ పర్యటిస్తున్నాయి. మృతుల కుటుంబ సభ్యులతో పాటు, వారితో ప్రాథమికంగా పరిచయం ఉన్నవారి (ప్రైమరీ కాంటాక్ట్స్) వివరాలను సేకరిస్తున్నారు. స్థానికంగా ఎవరికైనా జ్వరం, దగ్గు, శ్వాసకోశ సమస్యలు ఉన్నాయా అనే అంశంపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు.మరణానికి గల కచ్చితమైన కారణాలు, వైరస్ యొక్క కొత్త వేరియంట్ ఏమైనా ఉందా అనే కోణాన్ని నిర్ధారించుకోవడానికి బాధితుల నమూనాలను సేకరించి, పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్‌కు పంపించారు. అయితే, జిల్లాలో కరోనా వైరస్ వ్యాప్తి, ఈ మరణాలపై వైద్య ఆరోగ్య శాఖ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయకపోవడం గమనార్హం. అధికారులు అధికారికంగా నిర్ధారించే వరకు ప్రజలు భయాందోళనలకు గురికాకుండా, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## అమర్‌నాథ్ యాత్రకు పోటెత్తిన భక్తులు

**మొదటిపేజీ తరువాయి -** మంది పురుషులు, 2,042 మంది మహిళలు, 228 మంది సాధువులు, 10 మంది చిన్నారులు, 33 మంది విదేశీయులతో పాటు ఒక ట్రాన్స్‌జెండర్ కూడా ఉన్నారు. మొత్తం 354 వాహనాల్లో వీరిని తరలించారు.నిన్న లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా శ్రీనగర్ శివార్లలోని పంథా చౌక్ యాత్రి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "గత ఏడాదితో పోలిస్తే ఈసారి యాత్రికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇది జమ్మూకశ్మీర్ పర్యాటకానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిస్తుంది" అని అన్నారు. యాత్రికులు జమ్మూకశ్మీర్ చేతివృత్తులు, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి, ఇక్కడి కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఇది 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' స్ఫూర్తిని బలపరుస్తుందని పేర్కొన్నారు.మరోవైపు యాత్రికులకు నకిలీ రిజిస్ట్రేషన్లు చేసి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై నలుగురు స్థానిక ఉపాధ్యాయులను అధికారులు సస్పెండ్ చేసి, అదుపులోకి తీసుకున్నారు. గందర్‌బల్ జిల్లాలోని మణిగామ్ ట్రాన్సిట్ క్యాంపులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇలాంటి మోసపూరిత చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మనోజ్ సిన్హా అధికారులను ఆదేశించారు. అన్ని యాత్రా శిబిరాల వద్ద నిఘా పెంచినట్లు తెలిపారు.ఈ నెల 3న ప్రారంభమైన ఈ యాత్ర 56 రోజుల పాటు కొనసాగి, శ్రావణ పౌర్ణమి, రక్షాబంధన్ పర్వదినమైన ఆగస్టు 28న ముగుస్తుంది. భక్తులు హిమాలయాల్లో 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న పవిత్ర గుహకు సంప్రదాయ పహల్గామ్ మార్గం లేదా తక్కువ దూరం ఉండే బల్తాల్ మార్గం ద్వారా చేరుకుంటారు.

# భద్రాద్రి రామయ్య మీద ఒట్టు మళ్లీ మాదే అధికారం

**మొదటిపేజీ తరువాయి -** కుటుంబాన్ని మళ్లీ ఓడించే వరకు విశ్రమించనని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి, రైతు భరోసా నిధులను విడుదల చేసిన అనంతరం మాట్లాడారు.సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే తన గుండె పులకిస్తోందన్న సీఎం, రాజకీయంగా తనకు పాలమూరు ప్రాణమని, తన రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయగా పని చేసిందని తెలిపారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో ఎన్నికలకు వస్తున్నారని, వారిని ఎలా ఎదుర్కోగలరని కొందరు తనను ప్రశ్నించారని గుర్తు చేశారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని ఆనాడే చెప్పానని, ఎన్నికల్లో తమ పార్టీకి 64 సీట్లు వచ్చాయని స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో మరో రెండు సీట్లు వచ్చాయన్నారు. బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో సున్నా సీట్లు వస్తాయని చేవెళ్ల సభలో చెప్పానని, చేవెళ్ల సభలో చెప్పినట్లే బీఆర్ఎస్‌కు గుండు సున్నా సీట్లు వచ్చాయని తెలిపారు. అన్ని ఎన్నికల్లోనూ తాను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారన్న ఆయన, అన్ని ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశామని అన్నారు. కౌరవ వంశాన్ని (కల్వకుంట్ల కుటుంబం) తెలంగాణ గడ్డ మీద నుంచి తొలగిస్తామని, కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయంగా అణగ దొక్కేవరకు విశ్రాంతి తీసుకోనని స్పష్టం చేశారు.వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో డీ లిమిటేషన్ బిల్లు ఆమోదించుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవు. 2029 మే, జూన్‌లో జరుగుతాయి. అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు, ఎంపీ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయి. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం. 117 సీట్లు గెలుస్తామని భద్రాచలం రాముడి మీద ఆన.నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని, నేడు వరి వస్తే కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు పెట్టామని పేర్కొన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారని, కేసీఆర్ ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకో కాకిలా మాడిపోతావని ఎద్దేవా చేశారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ రైట్ అని వెల్లడించారు. రైతుల కళ్లలో ఆనందం చూడటమే తమ లక్ష్యమని, కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు ఉన్నాయని, వారి కుటుంబంలో ఒకరిని చూస్తే ఒకరికి నచ్చదని విమర్శించారు. మేడిగడ్డలో నీళ్లు నింపాలని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని, ఒకవేళ మేడిగడ్డలో నీళ్లు నింపితే భద్రాచలం మునుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. రాజకీయాల కోసం భద్రాచలం రాముడు మునగాలా అని ప్రశ్నించారు. హరీశ్‌రావు బీజేపీ నేతలతో రాత్రి మంతనాలు చేస్తున్నారని ఆరోపించిన సీఎం, బీజేపీతో మంతనాలు చేయట్లేదని హరీశ్‌రావు ప్రమాణం చేస్తారా అని సవాల్ విసిరారు. తాటిచెట్టంత పెరిగిన ఆయనకు బుర్రలో గుజ్జు లేదని ఎద్దేవా చేశారు."బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని ఆయన చెల్లెలే చెబుతున్నారు. ఆంధ్రా కాంట్రాక్టర్ల నుంచి ఆయన డబ్బులు తీసుకున్నారని చెల్లెలే చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే ఏ పథకాన్ని రద్దు చేయలేదు. నిరుద్యోగుల కలను కేసీఆర్ నెరవేర్చలేదు. మా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 67 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఆడబిడ్డలకు చీరల పంపిణీ చేసేందుకూ వాళ్లు కమీషన్లు తీసుకున్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. భట్టి కోరిక మేరకు మధిరకు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తున్నా. 20 ఎంపీ సీట్లు గెలిచి కాంగ్రెస్ అధిష్ఠానానికి బహుమతి ఇస్తాం. 5 లక్షల మందితో త్వరలో రాహుల్‌గాంధీతో ఖమ్మంలో సభ పెడతామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

# కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు



**మొదటిపేజీ తరువాయి -** సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా రాష్ట్రాల్లో భారీ వర్షాలతో తెలంగాణ ప్రాజెక్టుల్లోకి నీరు వస్తున్నప్పటికీ ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఈటల ఆరోపించారు. వర్షాకాలంలోనూ సాగునీరు అందక రైతులు కష్టాలు పడుతున్నారని, ముఖ్యంగా ఎస్ఆర్ఎస్పీ కాల్వల కింద బోర్లు, బావులు లేకుండా వ్యవసాయం చేయడం సాధ్యం కాదని చెప్పారు.తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, ఆత్మగౌరవం కోసమే జరిగిందని ఈటల గుర్తుచేశారు. రాజకీయాలు, సిద్ధాంతాలు వేరైనా మూలాలను మరచిపోవద్దన్నారు. కాళేశ్వరం కంటే ముందే వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం ద్వారా ప్రాణహిత జలాలను తీసుకురావాలనే ప్రణాళిక రూపొందిందని, శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రాజెక్టులకు అప్పుడే శ్రీకారం చుట్టారని వివరించారు.స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టును అభివృద్ధి చేసి ఎల్లంపల్లికి నీటిని తరలించే వ్యవస్థ ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టులో ఉన్న 29 టీఎంసీల నీరు కూడా ఆ ప్రాజెక్టుల ద్వారానే వచ్చిందన్నారు. కాళేశ్వరం వల్లే హుజూరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రెండు పంటలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, డిజైన్ మార్పులపై తాను మాట్లాడడం లేదని, కానీ మొత్తం ప్రాజెక్టునే తప్పుపట్టడం సరికాదని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ప్రాజెక్టు పరిధిలోని దెబ్బతిన్న నిర్మాణాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే రాష్ట్రం తీవ్ర కరవును ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065



# కూకట్‌పల్లిలో ఘనంగా వడ్డేపల్లి నర్సింగ్ రావు 74వ జయంతి వేడుకలు



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూ ఖనిజాభివృద్ధి శాఖ మాజీ చైర్మన్ స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు 74వ జయంతి వేడుకలు కూకట్‌పల్లిలోని వివేకానంద నగర్ కాలనీలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన కుమారుడు, రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కాలనీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని, వీఎన్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అభిమానుల మధ్య కేక్ కట్ చేసి జయంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ... తన తండ్రి స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు ప్రజాసేవనే పరమావధిగా భావించి, నిరంతరం ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. యువత సమాజ సేవను లక్ష్యంగా చేసుకుని ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు, కాలనీ ప్రముఖులు, అభిమానులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వర్గీయ నర్సింగ్ రావుకు నివాళులర్పించారు.

# గోపాల్‌నగర్ రోడ్ విస్తరణపై ప్లాట్ యజమానుల ఆందోళన: పరిష్కారం చూపిస్తామన్న బండి రమేష్



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** గోపాల్‌నగర్ మెయిన్ రోడ్డు విస్తరణ నేపథ్యంలో ప్లాట్ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై బండి రమేష్ స్పందించారు. స్థానిక ప్లాట్ యజమానుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం ఆయన గోపాల్‌నగర్ ప్రధాన రహదారిని సందర్శించి, బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ప్లాట్ యజమానులు మాట్లాడుతూ.. 1981లో తాము కొనుగోలు చేసిన నాటి లేఅవుట్ ప్రకారం రోడ్డు వెడల్పు 40 అడుగులు మాత్రమేనని, రిజిస్టర్డ్ పత్రాల్లో కూడా అదే ఉందని వివరించారు. మూసాపేట నుంచి లింగంపల్లి వరకు పలు ప్రాంతాల్లో రోడ్డు వెడల్పు 60 నుంచి 80 అడుగులు మాత్రమే ఉండగా, గోపాల్‌నగర్‌లో 120 అడుగుల పేరుతో భూసేకరణ చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. గత 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించి, తమ ఆస్తి హక్కులను కాపాడాలని వారు కోరారు. దీనిపై స్పందించిన బండి రమేష్ మాట్లాడుతూ.. యజమానుల పత్రాలను పరిశీలించి, సమస్య తీవ్రతను అర్థం చేసుకున్నానని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ బాబు, వినోద్ చావా, స్థానిక నాయకులు శ్రీనివాస్, తిలక్, అనిల్, సుధాకర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం

**రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల బంద్లో భాగంగా ములకలపల్లి మండలంలో బంద్ ప్రశాంతంగా జరిగింది.**




**చంద్రుగొండ, జూలై 10 ( వార్త సంధ్య):** రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల బంద్ భాగంగా శుక్రవారం ములకలపల్లి మం డలంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల నాయకుడు ముదిగొండ ప్రశాంత్ మాట్లాడుతూ, రాష్ట్ర విద్యాశాఖకు ఇప్పటికీ మంత్రిని నియమించకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను తగ్గించే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, విద్యా వ్యవస్థను బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని కోరారు. పెండింగ్లో ఉన్న స్కాలర్‌షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు, రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్, డ్రగ్స్ నివారణ కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యా హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అనులు చేయాలనినివారణ కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యా హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకుడు తెల్లం అఖిల్తో పాటు శరత్, కళ్యాణ్, సంజయ్, శేఖర్, నాగచైతన్య, నిశాంత్, దీపు, వంశీ, సాంబ, దోణి, నిఖిల్, గోపిక, స్వాతి, లావణ్య, రమ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** గాయత్రి నగర్ డివిజన్, వివేకానంద నగర్ కాలనీలోని శ్రీ భూనీలా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకల్లో రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్, రాజేశ్వరరావును శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం రాజేశ్వరరావు మాట్లాడుతూ, దేవాలయాలు భారతీయ సంస్కృతికి, సనాతన ధర్మానికి ప్రతీకలని, ఇటువంటి ఉత్సవాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, బీజేపీ నాయకులు, కాలనీ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కోసం తొలి ఉద్యమం ఏఐటియుసిదే..

**జూలై 15న ఆర్ఎల్‌సీ సమక్షంలో కీలక చర్చలు**

**విఫలమైతే ఆగస్టులో సమ్మెకు హెచ్చరిక**

**బొగ్గు బ్లాకులన్నీ సంస్థకే కేటాయించాలని కేంద్రానికి డిమాండ్**

**ఏఐటీయూసీ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య**



**కొత్తగూడెం, జూలై 10 (వార్త సంధ్య):** తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ తొలి ఉద్యమానికి శ్రీకారం చుట్టింది ఏఐటియుసినేనని ఆ సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, సింగరేణి పరిరక్షణ, కార్మికుల ఉపాధి భద్రత కోసం తాడిచర్ల-2తో పాటు మిగిలిన బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ, తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని కోరుతూ 2013లోనే ఏఐటియుసి సచివాలయాన్ని ముట్టడించి అరెస్టులకు కూడా గురై ఉద్యమాన్ని ప్రారంభించిందని గుర్తు చేశారు. ఈ అంశంపై ఏఐటియుసి నిరంతరం పోరాటం కొనసాగిస్తోందని తెలిపారు.

**సమ్మె నోటీసుపై కీలక పురోగతి :**

సింగరేణి యాజమాన్యానికి ఇచ్చిన సమ్మె నోటీసుపై కీలక పురోగతి చోటుచేసుకుందని వెల్లడించారు. ఈ నెల 15న రీజినల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలో యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి మధ్య మరోసారి చర్చలు జరగనున్నాయని చెప్పారు. ఆ చర్చలు కూడా విఫలమై ఆర్ఎల్‌సీ ఫెయిల్యూర్ రిపోర్ట్ జారీ చేస్తే ఆగస్టు నెలలో సమ్మెకు వెళ్లడం తప్పదని హెచ్చరించారు.

**40 శాతం లాభాల వాటా చెల్లించాలి :**

గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెం టనే ప్రకటించి, కార్మికులకు రావాల్సిన 40 శాతం లాభాల వాటాను ప్రతి కార్మికుడికి ఆలస్యం లేకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. అలా గే పెర్క్స్‌పై విధిస్తున్న ఆదాయపన్నును రద్దు చేయాలని, సింగ రేణిలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు.

**రూ.56 వేల కోట్లు వసూలు చేసి కొత్త ప్రాజెక్టులు తీసుకురావాలి :**

రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వసూలు చేసి, ఆ నిధులతో కొత్త బొగ్గు ప్రాజెక్టులను ప్రారంభించి సంస్థ భవిష్యత్తును, కార్మికుల ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు.

**కవిత 'బయ బాట'పై విమర్శలు :**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేపట్టిన "బయ బాట" కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ఇప్పుడు వారి పట్ల సానుభూతి వ్యక్తం చేయడం సమంజసం కాదని విమర్శించారు.

**కూనంనేని సేవలను ప్రశంసించిన ఏఐటియుసి :**

సింగరేణి కార్మికుల సమస్యలు, వారి కుటుంబాల ఇబ్బందులను అసెంబ్లీలో నిరంతరం ప్రస్తావించిన ఏకైక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావేనని ఏఐటియుసి నాయకులు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి కే. సారయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, ఉపాధ్యక్షుడు క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఆఫీస్ బేరర్ హుమాయూన్, నాయకులు ఎర్రగని కృష్ణయ్య, లక్ష్మీనారాయణ, శ్రీను, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సెజ్ అసోసియేషన్ వ్యవస్థాపకులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వండి



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 10 :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కి సెజ్ అసోసియేషన్ వ్యవస్థాపధ్యక్షుడు మెతుకు ఉప్పలయ్య విన్నపం తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ వివిధ కార్మిక సంఘాలతో తెలంగాణ అమర జ్యోతి కార్యాలయం లో సమావేశం జరిగింది. ఉద్యమ కారుల సంక్షేమం కొరకు కార్మిక సంఘాలనుండి అభిప్రాయాలు,సూచనలు గుర్తింపు కమిటీ స్వీకరించింది తెలంగాణ కాంట్రాక్టర్స్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్. రిజిస్ట్రేషన్ నెంబర్ 925/2012 తేదీ 24/5/2012 అసోసియేషన్ పూర్వ రంగారెడ్డి జిల్లాలోని ప్రస్తుతం మేడ్చల్ మల్కాజిగిరి లోని ఘట్కేసర్ మండలము అన్నోజీగూడ(-పోచారం) ప్రాంతము లో ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెతుకు ఉప్పలయ్య తెలిపారు.

**జై తెలంగాణ నినాదం ప్రత్యేక ఆర్థిక మండలి లో వినిపించడం,**

ఇట్టి పరిస్థితులలో జై తెలంగాణ నినాదం బలపరుస్తున్న వ్యవస్థాపక కార్యవర్గాన్ని విధుల నుంచి అకస్మాత్తుగా తొలగించినారు. ఇంటర్ పోల్ వ్యవస్థ జోక్యం ఉన్నందున మరియు వారి భవిష్యత్తు దృష్ట్యా తెలంగాణ సాధన కోసం జే.ఏ.సీ తో కలిసి ఇతర ప్రాంతాలలో ఉద్యమం చేసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్ లో జేఏసీ కమిటీ సభ్యులు సూచించారని మెతుకు ఉప్పలయ్య తెలిపారు టి జేఏసీ అనుబంధ అసోసియేషన్ అయిన తెలంగాణ ప్రైవేట్ సెక్టార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తో కలిసి జేఏసీ పిలుపుల మేరకు పలు తెలంగాణ ఉద్యమ కార్యక్రమాల లో పాల్గొన్నారు. రంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసు లో. ఎస్. ఇ 12/2012 కేసు ద్వారా కూడా తిరిగి డ్యూటీ ఇప్పించమని విన్నవించు కొన్నారు.

**ఈ అసోసియేషన్ ప్రాముఖ్యత**

1.సమైక్యాంధ్రప్రదేశ్ లో తెలంగాణ పేరుతో ఏర్పాటైన మొదటి మరియు ఏకైక సెజ్ అసోసియేషన్

2 భారతదేశములో కూడా ఏర్పాటు అయిన సెజ్ అసోసియేషన్ లలో కూడా ఇట్టి అసోసియేషన్ మొదటి వరసలో ఉన్నది. తెలంగాణ ఉద్యమ ములో పాల్గొని ఆర్థికంగా నష్టపోయి మరియు ఉన్న ఉద్యోగ ఉపాధి కోల్పోయినారు. కానీ. సెజ్ ప్రాంతము లో ఇంటర్ పోల్ వ్యవస్థ, మా భవిష్యత్ దృష్ట్యా ఉద్యమ సమయంలో ఎలాంటి కేసులు లేకుండా జాగ్రత్త పడినారు . ఎలాంటి కేసులు లేకున్నా ఇట్టి అసోసియేషన్ కార్య వర్గ సభ్యులను తెలంగాణ ఉద్యమ కారులుగా గుర్తింపు ఇవ్వాలని ఆయన కమిటీ ని కోరారు.

ఉద్యమకారులుగా ఎలా గుర్తించాలి.

ఎలాంటి కేసులు లేని వారిని ఉద్యమ కారులుగా గుర్తింపు కొరకు మా సూచనలు

1.ఉమ్మడి రాష్ట్రం లో తెలంగాణ పేరు మీద ఏదేని సంఘం ఏర్పాటు చేస్తే రిజిస్టర్ ఆఫీస్ పత్రాలు ద్వారా

2. పత్రిక వార్తలు ,3. వీడియోలు,4. ఫొటోలు,5. అధికారుల ఉత్తరప్రత్యుత్తరాలు,6. తెలంగాణ ఉద్యమములో పాల్గొన్న సంఘాల ధ్రువీకరణలు

ఉద్యమకారులుగా ఎవరిని గుర్తించాలి.

.అమర వీరుల కుటుంబాలను

. ఉద్యమం లో పాల్గొని అంగ వికలాంగులు అయిన వారిని

. ఉద్యమ సమయం లో శాంతి భద్రత సమస్యల పేరిట 1.రాష్ట్ర స్థాయి లో పోలీస్ లు కేసులు నమోదు అయినవారిని ,2. కేంద్ర స్థాయి పోలీస్ లు కేసులు నమోదు చేసిన వారిని,3. అంతర్జాతీయ స్థాయి లో పోలీసులు (ఇంటర్ పోల్) కేసులు నమోదు లేదా ప్రయత్నములు జరిగిన వారు కూడా గుర్తింప బడాలి.

. ఎలాంటి కేసులు లేకున్నా ఉద్యమకారులుగా గుర్తింపు వర్తింప చేయట

. ఉద్యమం లో పాల్గొనటం ద్వారం ఏ రూపం లో నైనా నష్టపోయి ఉండాలి.

.ఉద్యోగం / ఉపాధి కోల్పోయిన వారు కూడా ఉద్యమ కారులు ( అధికారుల లేఖలు, ఉద్యోగ కోర్టు కేసులు పత్రాల ద్వారా గుర్తింపు)

.సమైక్యాంధ్ర ప్రదేశ్ లో తెలంగాణ పేరు మీద వివిధ సంఘాల ఏర్పాటు వ్యవస్థాపకులు కూడా ఉద్యమకారులు గా గుర్తింప బడాలి ( అధికారుల లేఖలు,రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలద్వారా గుర్తింపు ) . సెజ్ ( ప్రత్యేక ఆర్థిక మండలి) లో తెలంగాణ పేరు మీద ఏర్పాటు చేసిన అసోసియేషన్ వ్యవస్థాపకులకు ప్రత్యేక కేటగిరి ద్వారా గుర్తింపు ఇచ్చి తెలంగాణ సాధన ఉద్యమ కారులుగా గుర్తించాలి.

ఉద్యమకారులకు/ కుటుంబాలకు ప్రభుత్వం ఏమి ఇవ్వాలి

1.అమర వీరుల కుటుంబాలకు ఎంత గుర్తింపు ఇచ్చిన తక్కువగా ఉంటుందని భావిస్తున్నాము.

2అధికార ధృవీకరణ పత్రం

3.250 గజాల ఇంటిస్థలం ప్రస్తుత నివాస ప్రాంతము లోనే ఇవ్వాలి. మరియు పేదవారికి ఇళ్లు కట్టి ఇవ్వాలి.

4.. 50 సంవత్సరాల వయసు దాటిన రేషన్ కార్డు కలిగి ఉన్న ఉద్యమకారులకువారికి రూపాయలు25000 తెలంగాణ సమరయోధుల పెన్షన్ ఇవ్వాలి.

5.ఉచిత ప్రయాణం.

6. అధికార కార్యక్రమాల్లో పాల్గొనుటకు ముఖ్య ప్రాధాన్యత గుర్తింపుఇవ్వాలి.

7.. తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న ఉద్యమకారులకు కుటుంబ ఆర్థిక పరిస్థితి లను సరిదిద్దుకొనుటకు ఒకొక్క కుటుంబమునకు 10 లక్షలు ఆర్థిక సహాయం చేయాలి.

8..భవిష్యత్ తరాల కొరకు అందరూ ఉద్యమకారుల సంబంధ వర్గాల వివరాలు పోరాటం తీరు, వివిధసంఘాల పని తీరు తో ఒక పుస్తకం ముద్రణ తో పూర్తి సమాచారం ఉండేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అన్ని ఉద్యోగ పరీక్షల్లో( ఆల్ ప్రొఫెషనల్ ఉద్యోగపరీక్షల్లో కూడా) తెలంగాణ సాధన ఉద్యమ చరిత్ర నుండి కనీసం 5 శాతం ప్రశ్నలు ఇవ్వాలి. మొదలైన అంశాలతో ఉద్యమకారుల గుర్తింపు కమిటీని. తెలంగాణ సెజ్ కాంట్రాక్టర్స్ ఉ అవుట్సోర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులు కే. నర్సింగరావు,బీమేష్,సాగర్ కూడా కోరారు.

# భద్రాద్రి లో విద్యాసంస్థల బంద్ విజయవంతం

**విద్యా సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్**

**ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం**

**రేవంత్ సర్కార్‌పై వామపక్ష విద్యార్థి సంఘాల ఆగ్రహం**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 10 (వార్త సంధ్య) :** తెలంగాణలో విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని, విద్యార్థుల భవిష్యత్తుతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శిస్తూ, వెంటనే చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విజయవంతమైంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు తరగతులను బహిష్కరించగా, పలు ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద నాగకృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బుర్రి వీరభద్రం, జిల్లా కార్యదర్శి దుర్గం ప్రణయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం రోజురోజుకూ సంక్షోభంలోకి నెట్టబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలుగా రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వం 27 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ప్రతిపాదనను విరమించుకోవాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల అధిక ఫీజులను నియంత్రించేందుకు సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని కోరారు. అలాగే రూ.10,814 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, రూ.250 కోట్ల బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులను చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించి, విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, నూతన జాతీయ విద్యా విధానం--2020కు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తీర్మానం చేయాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థుల సమస్యలపై స్పందించి చర్యలు తీసుకోకపోతే రాష్ట్రంలోని అన్ని విద్యార్థి సంఘాలను ఏకం చేసి భారీ ఉద్యమాలకు శ్రీకారం చుడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొరిమి సంజయ్, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి సంతోష్, గుగులోత్ వీరభద్రం, పీడీఎస్‌యూ నాయకులు విఘ్నేష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ పాదయాత్రను విజయవంతం చేయండి

**"ఐసీడీఎస్‌ను కాపాడండి**

**-అంగన్వాడీ కేంద్రాలను పరిరక్షించండి"**

**జూలై 12, 13 తేదీల్లో పాదయాత్ర**

**అంగన్వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను**

**వెంటనే అమలు చేయాలి**

**ప్రభుత్వానికి ఏఐటీయూసీ డిమాండ్**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 10 (వార్త సంధ్య) :** అంగన్వాడీ కేంద్రాల పరిరక్షణతో పాటు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం "ఐసీడీఎస్‌ను కాపాడండి--అంగన్వాడీ కేంద్రాలను పరిరక్షించండి" అనే నినాదంతో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో జూలై 12, 13 తేదీలలో భద్రాచలం నుంచి కొత్తగూడెం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్. సీతా మహాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు నెలకు రూ.18 వేల వేతనం అమలు చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఉద్యోగులపై విధిస్తున్న బూత్ స్థాయి అధికారి విధులతో పాటు ఇతర అదనపు పనులను రద్దు చేయాలని, ఉచిత ప్రాథమిక విద్యా కేంద్రాల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అంగన్వాడీ ఉద్యోగులకు రూ.1 కోటి ప్రమాద బీమా, ఆరోగ్య గుర్తింపు కార్డు, భవిష్య నిధి (పీఎఫ్) సౌకర్యం కల్పించాలని, అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రను ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.కె. సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్ ప్రారంభిస్తారని తెలిపారు. పాదయాత్ర ప్రారంభ సందర్భంగా భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించే బహిరంగ సభలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని వెల్లడించారు. అంగన్వాడీ ఉద్యోగులు, కార్మికులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె. జమలయ్య, నాయకులు వేల్పుల మల్లికార్జున్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు గోనే మణి, నాయకులు రెడ్డి అరుణ, సంధ్య, పాయం లత, చిన్నారి, శోభారాణి, అనిత, పార్వతి, శ్రీదేవి, సరోజా, కమల తదితరులు పాల్గొన్నారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు

## మాల సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ జి. చెన్నయ్య నాయకత్వంలో, తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్కని కలిసి మాలలకు రోస్టర్ విధానంలో జరుగుతున్న అన్యాయంపై వినతిపత్రం సమర్పించడం జరిగింది.



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 10.** : ప్రస్తుతం అమలులో ఉన్న రోస్టర్ విధానం కారణంగా మాలలు మాల–ఉపకులాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగ యువత విద్యా ఉద్యోగ అవకాశాల్లో నష్టపోతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రోస్టర్ విధానాన్ని పునఃసమీక్షించి, మాలలు మాల–ఉపకులాలకు న్యాయం జరిగేలా తగిన మార్పులు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీమతి సీతక్క సమస్యను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. మాలలు, మాల–ఉపకులాల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ జి. చెన్నయ్య పేర్కొన్నారు.

# నేను స్వరాజ్ సైనికుడిని..



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 10.** : జై స్వరాజ్ పార్టీ చేపట్టిన గ్రామ స్వరాజ్యం ఉద్యమం ప్రతి గడప, ప్రతి గొంతును చేరాలనే లక్ష్యంతో సామాన్యుల నుంచి అసామాన్యుల వరకు కలిసి వారి అభిప్రాయాలను తీసుకుంటున్నాం. ఈ రోజు సరూర్ నగర్ తహసీల్దార్ శ్రీ వేణుగోపాల్ ని పార్టీ నాయకులు శ్రీ జనగాం వెంకటేష్ గౌడ్, నాగమణిలతో కలిసి గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్ర గురించి జై స్వరాజ్ పార్టీ అధినేత శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ చర్చించారు.

## జనసేనలో చేరిన న్యాయవాది రవి వర్మ



**వార్తా సంధ్య కూకట్‌పల్లి** : నియోజకవర్గ పరిధిలోని హైదర్‌నగర్ డివిజన్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది రవి వర్మ, శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకుని జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆయనను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవి వర్మ మాట్లాడుతూ.. ప్రజాసేవ, పారదర్శక పాలన, రాజ్యాంగ విలువల పరిరక్షణ మరియు యువత సాధికారత వంటి అంశాల్లో జనసేన పార్టీ అనుసరిస్తున్న విధానాలు తనను ఎంతగానో ఆకర్షించాయని తెలిపారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసేన పార్టీ ఇంచార్జ్ శంకర్ గౌడ్, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రామ్ తాళ్లూరి, చేరికల కమిటీ సభ్యులు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, డా. గడల శ్రీనివాస్, ప్రజీత్ గౌడ్, తనీష్, సీనియర్ నాయకులు రాజ లింగం, రామకృష్ణ, సాగర్ తదితరులు పాల్గొన్నారు. రవి వర్మ చేరికతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇల్లందు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గైడ్లు, బ్యాగులు, స్టేషనరీ పంపిణీ

### విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది చైర్మన్ కేతిరెడ్డి శకుంతల రెడ్డి




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 10 (వార్త సంధ్య)** : విద్యార్థుల విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో కేఎల్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోని జేబీఎస్ – జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. కేఎల్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కేతిరెడ్డి శకుంతల రెడ్డి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థిని ఎస్.ఎస్. నందిని, ఎనిమిదో తరగతి విద్యార్థి ఎస్.కే. ఆదిత్యలకు గైడ్లు, స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, స్టేషనరీ సామగ్రి, వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు విద్యకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కేఎల్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కేతిరెడ్డి శకుంతల రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు.

## నిర్ణీత గడువులోగా సర్ ప్రక్రియ పూర్తి చేయాలి


### భారత ఎన్నికల కమిషన్ సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)జూలై 10** : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల కమిషన్ సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సర్ ప్రక్రియపై పవన్ కుమార్ శర్మ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ. సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు(డిఇఓలు), ఓటరు జాబితా పరిశీలకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజెషన్ ప్రక్రియలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్––మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ప్రత్యేకంగా ఆదేశించారు. సర్ ప్రక్రియలో అత్యుత్తమ పనితీరును కనబరిచిన జిల్లాల ఎన్నికల అధికారులతో కమిషన్ మాట్లాడి, వారు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను తెలుసుకుంది. ఆ వ్యూహాలను ఇతర జిల్లాలు కూడా అమలు చేసి, ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసి చేయాలని ఆదేశించారు. అదనంగా, రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియలను ప్రతిరోజూ నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారికి భారత ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో 2026 ప్రక్రియను నిర్ణీత సమయంలో విజయవంతంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది.

# తెలంగాణ ఉద్యమకారులకు హెచ్చరిక

### మోసపూరిత కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలి
### ఉద్యమకారుల వేదిక పేరుతో జరుగుతున్న ప్రచారం పై తోడేటి శంకర్ గౌడ్ ఫైర్
### ప్రజలు, ఉద్యమకారులు ధ్రువీకరణ లేకుండా ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని విజ్ఞప్తి




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 10 (వార్త సంధ్య)** : తెలంగాణ ఉద్యమకారుల వేదిక పేరుతో కొందరు వ్యక్తులు నిర్వహిస్తున్న కార్యక్రమాలు, సమావేశాల విషయంలో తెలంగాణ ఉద్యమకారులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యమకారుల వేదిక రాష్ట్ర వైస్ చైర్మన్‌గా పేర్కొన్న తోడేటి శంకర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, "తెలంగాణ ఉద్యమకారుల వేదిక" పేరుతో జరిగిన రిజిస్ట్రేషన్‌లో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న చిరునామా తప్పుగా ఉందని, ఈ విషయమై ఖమ్మం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పలుమార్లు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం దీనిపై విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. అలాగే, ఆ సంస్థ పాలక మండలిలో ఉన్న సభ్యుల్లో నిజమైన తెలంగాణ ఉద్యమకారుడు ఒక్కరే ఉన్నారని, మిగిలిన వారు ఉద్యమంతో సంబంధం లేని వారేనని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారుల పేరుతో మాట్లాడే వారు తమ ఉద్యమ చరిత్ర, నమోదైన కేసుల వివరాలు, సంబంధిత పోలీస్ స్టేషన్ వివరాలను వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా నరాల సత్యనారాయణ అనే వ్యక్తిపై కూడా పలు ఆరోపణలు చేశారు. సఖి మహిళా మండలి, తెలంగాణ రక్షణ సమితి పేర్లతో అమాయక మహిళలు, ఉద్యమకారుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనికి సంబంధించి తమ వద్ద రసీదులు, ఆడియో రికార్డులు సహా ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యమకారులు, ప్రజలు ఎవరి సమావేశాలకు హాజరయ్యే ముందు వారి ఉద్యమ నేపథ్యం, కేసుల వివరాల ను తెలుసుకోవాలని, ఎటువంటి ధ్రువీకరణ లేకుండా ఎవరికీ నగదు ఇవ్వవద్దని సూచించారు. దళారులు, బ్రోకర్ల మాటలు నమ్మి మోసపోవద్దని, నిజమైన ఉద్యమకారుల ఐక్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

## స్వరాష్ట్ర సాధనలో కార్మిక సంఘాలదే అత్యంత కీలక పాత్ర

### : అమరవీరుల స్తూపం సాక్షిగా ట్రేడ్ యూనియన్ల పోరాటాన్ని కొనియాడిన ఉన్నత స్థాయి కమిటీ

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)జూలై 10** : తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) మొదటి అంతస్తులో జరుగుతున్న ముఖాముఖి సంప్రదింపుల ప్రక్రియ నేడు (జూలై 10న) అత్యంత పీక్ స్టేజ్‌కి చేరుకుంది. జూలై 6వ తేదీ నుండి ప్రారంభమైన ఈ ప్రత్యేక సమీక్షా విండోలో భాగంగా, నేడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు అసంఘటిత రంగ కార్మిక శ్రేణులు కమిటీని కలిసి తమ వినతులను సమర్పించారు. నేటి సమీక్షా సమావేశంలో కమిటీకి సంబంధించిన ప్యానల్ సభ్యులు హాజరై, వచ్చిన ప్రతినిధులతో ముఖాముఖిగా సుదీర్ఘ చర్చలు జరిపారు. హాజరైన కమిటీ చైర్మన్ సభ్యులు: డాక్టర్ కె. కేశవరావు (గౌరవ చైర్మన్) ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్ (గౌరవ ఎమ్మెల్సీ ఢ కమిటీ సభ్యులు) అద్దంకి దయాకర్ (గౌరవ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ ఢ కమిటీ సభ్యులు) మోతె శోభన్ రెడ్డి (గౌరవ ఎగ్జిక్యూటివ్ మెంబర్) శ్రీ ఎస్. రాములు నాయక్ ( ఎగ్జిక్యూటివ్ మెంబర్) "ఉద్యమానికి కార్మిక సంఘాలే వెన్నుముక" --- కమిటీ సభ్యుల ఏకగ్రీవ ప్రకటన నేటి ముఖాముఖి సమావేశంలో కమిటీ చైర్మన్ మరియు సభ్యులు కార్మిక సంఘాల పాత్రపైనే ప్రత్యేకంగా అత్యధిక సమయం మాట్లాడారు. స్వరాష్ట్ర సాధనలో ట్రేడ్ యూనియన్ల పాత్ర అత్యంత కీలకమైన పాత్ర అని ప్యానల్ ముక్తకంఠంతో



కొనియాడింది. నాడు ఆర్టీసీ, సింగరేణి, రైల్వే , ఉద్యోగులతో పాటు అసంఘటిత రంగ కార్మికులు రోడ్లపైకి వచ్చి, 'సకల జనుల సమ్మె ' ద్వారా యావత్ ప్రభుత్వ యంత్రాంగాన్ని స్తంభింపజేయడం వల్లే నాటి ఢిల్లీ పీఠం దిగివచ్చిందని కమిటీ గుర్తుచేసింది. కార్మిక లోకం అందించిన ఆ చారిత్రాత్మక ఊపు లేకపోతే తెలంగాణ కల సాకారం అయ్యేది కాదని, అందుకే ఉద్యమ చరిత్రలో కార్మికులకు అగ్రతాంబూలం దక్కుతుందని కమిటీ స్పష్టం చేసింది.

**ఉద్యమకారుల ప్రధాన వినతులు – డిమాండ్లు:**

1969 నాటి ఉద్యమకారులతో పాటు నేడు హాజరైన వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు కమిటీ సమక్షంలో తమ ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరుతూ ఈ క్రింది ప్రధాన డిమాండ్లను రాతపూర్వకంగా సమర్పించారు:

**ప్రభుత్వ ప్రశంస – అధికారిక గుర్తింపు**

నాడు పోరాడిన ప్రతి కార్మిక యోధునికి, ఉద్యమకారునికి ప్రభుత్వ ముద్రతో కూడిన అధికారిక ప్రశంసా పత్రాలు అందించి గౌరవించాలి. 250 గజాల నివాస స్థలం: అర్హులైన ప్రతి ఉద్యమకారుడి కుటుంబానికి నివాస అవసరాల నిమిత్తం 250 గజాల భూమిని ప్రభుత్వం కేటాయించాలి. ఆరోగ్య భరోసా : ఉద్యమకారులకు వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ ఉచిత వైద్యం అందేలా ప్రత్యేక హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. పెన్షన్లు వృద్ధాప్యంలో ఉన్న ఉద్యమకారుల జీవన భృతి కోసం శాశ్వత ప్రాతిపదికన నెలవారీ గౌరవ వేతనం (పెన్షన్) అందించాలి.

**ఉచిత రవాణ సదుపాయం.**

కమిటీ సభ్యుల కీలక హామీ: కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు మాట్లాడుతూ.. కార్మికులు అడిగే ఈ సంక్షేమ ఫలాలు ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదని, నాడు రక్తం, చెమట చిందించి సాధించుకున్న వారి హక్కు అని ఉద్ఘాటించారు. సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా జరుగుతున్న ఈ పూర్తి స్థాయి డిజిటల్ రికార్డింగ్ ప్రక్రియ ఆధారంగా, ప్రతి ఒక్క నిజమైన కార్మిక ఉద్యమకారుడి పేరును రికార్డుల్లో ఎక్కించి ఎక్కించాలని కోరారు సెజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెతుకు ఉప్పలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

## ఎంపీ వద్దిరాజు లోకసభ మాజీ సభ్యులు బోయినపల్లి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమలతో కలిసి భారత ఎన్నికల సంఘంతో సమావేశం

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూలై 10.** : ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ విజయవంతం కావాలంటే బూత్ లెవల్ అధికారుల బి ఎల్ వో లుపనితీరు మరింత సమర్థవంతంగా ఉండాలని లోకసభ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బోయినపల్లి వినోద్ కుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి వివరించారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో నియమించిన బూత్ లెవల్ అధికారులకు ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన లేకపోవడంతో పాటు, అవసరమైన ఫారాలు కూడా అందుబాటులో లేని పరిస్థితులు ఉన్నాయని చెప్పారు.బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర,లోకసభ మాజీ సభ్యులు వినోద్ కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ ల కూడిన ప్రతినిధి బృందం అశోకా రోడ్డు ఉన్న నిర్వాచన్ సదన్ లో శుక్రవారం సాయంత్రం భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్,కమిషనర్లు డాక్టర్ సుఖబీర్ సింగ్ సంధూ, డాక్టర్ వివేక్ జోషిలతో భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ..

హైదరాబాద్‌లో ఇలాంటి సమస్యలు గుర్తించిన తర్వాత కొంతమంది అధికారులను మార్చిన విషయాన్ని కూడా ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. బీఆర్ఎస్ పక్షాన రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 వేల మంది బూత్ లెవల్ అసిస్టెంట్లను నియమించా మని, వారు ప్రతి బూత్‌లో ఓటర్లకు సహాయపడుతూ సవరణ ప్రక్రియలో భాగస్వాములవుతున్నారని తెలిపారు. ఓటరు జాబితాల ప్రక్షాళన నిరంతర ప్రక్రియ అని పేర్కొన్న ఆయన, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తే ఈ ప్రక్రియ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సాగుతుందన్నారు. ముఖ్యంగా ఓటరు వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తే డూప్లికేట్ నమోదులను గుర్తించడం సులభమవుతుందని సూచించారు. అయితే, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆధార్‌ను తప్పనిసరి చేయడం సాధ్యం కాదని తాము గుర్తించామని, అయినా,తమ అనుభవం




ప్రకారం దాదాపు 99 శాతం మంది ఓటర్లు స్వచ్ఛందంగా ఆధార్ వివరాలను అందిస్తున్నారని ఆయన తెలిపారు. అలాంటి సందర్భాల్లో ఆధార్ ఆధారిత ధ్రువీకరణ ఓటరు జాబితాల పరిశుభ్రతకు, పారదర్శకతకు ఎంతో ఉపయోగ పడుతుందని కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ప్రతినిధి బృందం వివరించడం జరిగిందని వినోద్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రస్తుతం నెమ్మదిగా సాగుతోందని, ఇప్పటివరకు కేవలం 5 నుంచి 10 శాతం వరకు మాత్రమే ప్రక్రియ పూర్తయిందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సమర్థవంతంగా, పారదర్శకంగా పూర్తయ్యేందుకు మరింత సమయం అవసరమని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు చెప్పారు. ఈ మేరకు ఒకటి నుంచి రెండు నెలల పాటు గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేశామన్నారు. దేశవ్యాప్తంగా ఓటరు జాబితాలు పూర్తిగా ప్రక్షాళన కావాలంటే సరిహద్దు రాష్ట్రాల్లో ఉన్న డూప్లికేట్ ఓటర్ల సమస్యను కూడా పరిష్కరించాల్సి ఉంటుందని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు. తెలంగాణ––మహారాష్ట్ర, తెలంగాణ––కర్ణాటక, తెలంగాణ––ఆంధ్రప్రదేశ్, తెలంగాణ––ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఒకే వ్యక్తి పేరుతో రెండు చోట్ల ఓటు నమోదైన సందర్భాలు ఉన్నాయని, అలాంటి లోపాలను ఎస్ఐఆర్ ద్వారా సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి భారత పౌరుడికి దేశం మొత్తంమీద ఒకే ఓటు ఉండాలన్నదే బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) ఆలోచన అని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.ఏ రాష్ట్రంలో నివసిస్తున్నారో అక్కడే ఒక్కసారి మాత్రమే ఓటు నమోదు ఉండేలా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా తాము సూచించినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం బూత్ స్థాయిలో అవసరమైన ఫారాలు, సిబ్బంది, సాంకేతిక సౌకర్యాల కొరత వల్ల ప్రక్రియ ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదన్న అంశాలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లామని ఎంపీ రవిచంద్ర వివరించారు. ఓటర్ల తొలగింపు, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన వారి ఓట్ల నమోదు, డూప్లికేట్ ఓట్ల తొలగింపు వంటి అంశాలను పూర్తి స్థాయిలో



పరిశీలించాలంటే అదనపు సమయం అవసరమని వివరించడం జరిగిందన్నారు. తాము వివరించిన అంశాల పట్ల ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించిందని, పరిస్థితులను పరిశీలించి గడువు పెంపుపై నిర్ణయం తీసుకుంటామని బదులిచ్చారని ఎంపీ రవిచంద్ర చెప్పారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో గణనీయ సంఖ్యలో డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు తమ పార్టీ గుర్తించిందని, కొన్ని జిల్లాల్లో వేల సంఖ్యలో డూప్లికేట్ ఓటర్ల వివరాలను సేకరించి ఎన్నికల సంఘానికి నివేదిక రూపంలో అందజేశామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో డూప్లికేట్ ఓటర్లు ఉన్నట్లు తమ పార్టీ అధ్యయనంలో తేలిందని, వాటిని తొలగించడం ద్వారా ఓటరు జాబితాలు మరింత స్వచ్ఛంగా, పారదర్శకంగా మారగలవన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, పూర్తిగా నిష్పాక్షికంగా, నిజాయితీగా, ప్రతి అర్హుడైన పౌరుడికి న్యాయం జరిగేలా నిర్వహించాలని బీఆర్ఎస్ తరఫున కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్లు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వివరించారు.

## రాష్ట్రాన్ని పెట్టుబడి గమ్య స్థానంగా తీర్చిదిద్దామని సిఎస్ సంజయ్ జాజు చెప్పారు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)జూలై 10:** తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ప్రాధాన్య పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో చేపడుతున్న కీలక పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై సిఎస్ శుక్రవారం సచివాలయంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణంగా పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయాలని, మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడానికి, పెద్ద ఎత్తున ఉపాధి అవకా శాలను కల్పించడానికి వీలు కలుగుతుందని అన్నారు. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ద్వారా భారత్ ఫ్యూచర్ సిటీ, జహీరాబాద్ ఇండస్ట్రియల్ సిటీ, కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ తో పాటు ఇతర వ్యూహాత్మక పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ శశాంక ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి, అభివృద్ధి చేస్తున్న మౌలిక సదుపాయాలు, పెట్టుబడి అవకాశాలు, పూర్తి చేయాల్సిన గడువులపై సిఎస్ కు వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా అధికారులు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ఆయన ఆదేశించారు.అలాగే రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే అవరోధాలను ముందుగానే గుర్తించి, శాఖల మధ్య సమన్వయంతో వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, జహీరాబాద్ ఇండస్ట్రియల్ సిటీ, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు తెలంగాణ పారిశ్రామిక రంగాన్ని రూపాంతరం చెందించడంతో పాటు భారీ పెట్టుబడులను ఆకర్షించి, ప్రాంతీయ సమతుల అభివృద్ధికి దోహదపడే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలు వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చేనేత, వస్త్ర శాఖ ప్రత్యేక కార్యదర్శి కాత్యాయనీ దేవి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో అజిత్ రెడ్డి, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## చలో కొత్తగూడెం పోస్టర్‌ను ఆవిష్కరించిన పవన్ కళ్యాణ్

### ఉమ్మడి ఖమ్మం జిల్లా జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి సన్నాహాలు
### జూలై 12న కొత్తగూడెంలో భారీ సమావేశం
### జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు





**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 10 (వార్త సంధ్య)** : ఉమ్మడి ఖమ్మం జిల్లా జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి సంబంధించిన 'చలో కొత్తగూడెం' పోస్టర్‌ను జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడం, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి జనసైనికుడు ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తూ, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశం జూలై 12 (ఆదివారం) ఉదయం 10:30 గంటలకు కొత్తగూడెంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, జనసైనికులు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకుడు, చేరికల కమిటీ సభ్యుడు డాక్టర్ గడల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

# హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో తిరిగొచ్చే ఈ టూరిస్ట్ స్పాట్స్

సెలవురోజు, వీకెండ్ వచ్చిందంటే చాలు.. అందమైన పర్యాటకం.. అనురాగాల ప్రయాణం అంటూ.. నగరవాసులు విహార యాత్రలకు జై కొడుతున్నారు. ఉరుకులు..పరుగుల జీవన ప్రయాణంలో ఇల్లూ.. ఆఫీసుల మధ్య పనుల ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు.. కాసేపు ప్రకృతి ఒడిలో ఓలలాడుతున్నారు. మరీ కొత్త ప్రదేశాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా.. కాస్త పరిచయం ఉన్న చోట్లకే టూర్లు వేసుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో చూడగల పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు.



## లక్నవరం సరస్సు..



నగర పర్యాటకులను ఆకర్షించే ముఖ్యమైన వాటిల్లో లక్నవరం ఒకటి. హైదరాబాద్ నుంచి 220 కిలో మీటర్లు. ఈ ప్రదేశం చుట్టుపక్కల ఉండే ఏటూరునాగారం అభయారణ్య సందర్శకులను కనువిందు చేస్తున్నది. లేక్ క్రాసింగ్, రోప్ కోర్సులు, కయాకింగ్ వంటివి అందుబాటులో ఉంటాయి. దీనికి సమీపంలో బొగత జలపాతం కూడా కనువిందు చేసే పర్యాటక ప్రాంతం.

## శామీర్‌పేట్ లేక్..



హైదరాబాద్ శివారు ప్రాంతమైన శామీర్‌పేట్ సికింద్రాబాద్‌కు 20 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ ఎన్నో విలాసవంతమైన రెస్టారెంట్లు, హొటళు ఉన్నాయి. ఇక్కడ ఉన్న జింకల పార్క్‌లో జింకలతో పాటు నెమళ్లు, అనేక రకాల పక్షులు కనిపిస్తాయి.

## డిండి..



నల్గొండ జిల్లాలో ఉంది. హైదరాబాద్ నుంచి 108 కిలోమీటర్ల దూరం. సుమారు 2:30 గంటల జర్నీ. ప్రశాంత వాతావరణానికి మారుపేరుగా ఉన్న డిండిలో సుందరమైన దృశ్యాలు అనేకం. ట్రెక్కింగ్, బ్యాక్ వాటర్ ట్రిప్స్‌తో ఎంజాయ్ చేయొచ్చు. శ్రీశైలానికి వెళ్లేదారిలో డిండిని చూసేందుకు పర్యాటకులు ప్రత్యేక ఆసక్తి చూపిస్తారు. నీటి అందాలతో సెల్ఫీలు దిగి సందడి చేస్తారు.

## కొండపోచమ్మ



నూతనోత్తేజాన్ని నింపే అత్యుత్తమ క్యాంపింగ్ ప్రదేశంగా దీనిని చెప్పవచ్చు. హైదరాబాద్‌కు 50 కిలో మీటర్ల దూరంలో ఉంది. సిద్దిపేట జిల్లాలో ఉన్న ఈ రిజర్వాయర్ అందాలు ప్రత్యేకం. వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అందుకే ఇక్కడ క్యాంపింగ్ చేసేందుకు అధిక శాతం పర్యాటకులు ఆసక్తి చూపుతారు.

## అనంతగిరి




ట్రెక్కింగ్ కోరుకునే వారికి అనంతగిరి స్వర్గధామం. వికారాబాద్‌కు కేవలం పది కిలోమీటర్లు.. హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. అనంతగిరి కొండల చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతం.. నిర్మలమైన వాతావరణం పర్యాటకులను ఆకర్షిస్తోంది.ప్రాచీనమైన అనంతగిరి పద్మనాభ స్వామి ఆలయాన్ని కూడా దర్శించుకోవచ్చు.

## కీసరపోదాం..



ఆధ్యాత్మిక ప్రాంతంగా పరిఢవిల్లుతున్న కీసర.. పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి. పక్షుల కిలకిలరావాలు..'హరితహారం'తో స్వాగతం పలికే చెట్లు.. సుందరీకరణతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న చెరువులు.. నలువైపులా వీక్షించేలా కొండపై కొలువుదీరిన వ్యూ పాయింట్స్.. అచ్చు ప్రకృతి సంపదతో నిర్మించినట్టుగా అనుభూతి కలిగించే ఆర్నమెంటల్ ఫెన్సింగ్.. ఆరోగ్యాన్ని పంచే ఔషధ మొక్కల కూడళ్లు.. నలువైపులా పరుచుకున్న పచ్చదనంతో కీసర.. పర్యాటకుల డెస్టినేషన్ లిస్టులో మొదటివరుసలోకి చేరింది. సుమారు 1562 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అటవీ ప్రాంతంలో విభిన్న రకాల మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

## రాచకొండ కోట..



నగరం నుంచి 65 కిలో మీటర్ల దూరం. ఇది 14వ శతాబ్దానికి చెందిన కోట. ట్రెక్కింగ్‌కు అనుకూలం. యాదాద్రి-భువనగిరి జిల్లాలో ఉంది. కోట పై నుంచి చూస్తే ఆకుపచ్చని ప్రాంతాల అందాలు కనువిందు చేస్తాయి.

## శ్రీరాం సాగర్..




హైదరాబాద్ నుంచి 207 కిలోమీటర్ల దూరం. సుమారు 4గంటల జర్నీ. ఉత్తర తెలంగాణ జిల్లాకు వరప్రదాయిని. గోదావరి నది మీద కట్టిన ఈ ప్రాజెక్టును చూసేందుకు సందర్శకులు ఆసక్తి చూపిస్తారు. బడా పహాడ్ దర్గా, ఖిల్లా జైలు, సిర్నాపల్లి గడీ, డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, దేవల్ మసీద్, కందకుర్తి త్రివేణి సంగమం, రామడుగు జలాశయం, అలీసాగర్ తదితర పర్యాటక ప్రాంతాలన్నింటినీ వీక్షించొచ్చు.

## శ్రీశైలం..



ప్రముఖ పుణ్యక్షేత్రం ఇది. హైదరాబాద్ నుంచి 5 గంటల ప్రయాణం. సుందరమైన దృశ్యాలకు నెలవు. కృష్ణా నదిపై నిర్మించిన శ్రీశైలం ఆనకట్టను వీక్షించొచ్చు. అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో ఇది ఒక్కటి. నది ఒడ్డున ఉన్న 12 జ్యోతిర్లింగాల్లో ఒకటైన మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించొచ్చు. భ్రమరాంబదేవి , సాక్షి గణపతి దేవాలయాలున్నాయి. ప్రకృతి అందాలను వీక్షించొచ్చు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులే కాదు.. నగరానికి చేరువలో అనేక జలపాతాలున్నాయి. అందులో బొగత, నిర్మల్ జిల్లాలో కుంటాల, పొచ్చర వంటివి ఉన్నాయి.

## నల్లమల అడవులు..



నగరం నుంచి 219 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో క్యాంపింగ్ చేయడం ఎంతో కిక్కిస్తుంది. ప్రకృతివనంలో ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. చుట్టూ ప్రకృతి అందాలతో నిండిన ఈ ప్రాంతంలో పర్యాటకుల సాహసాలను, ఉత్కంఠభరితమైన కార్యకలాపాలను ఆస్వాదించొచ్చు. సాహస భరిత అనుభూతిని పొందేందుకు సరైన డెస్టినేషన్ ఇది. పర్వతారోహణ, శివాలయం, కంబం సరస్సు అందుబాటులో ఉండే ప్రాంతాలు.

## సిటీ చుట్టూ థీమ్‌లు..





ఓఆర్ఆర్ నుంచి 25 కిలోమీటర్ల పరిధిలో పదికి పైగా ఉన్న థీమ్ పార్కులు పర్యాటకులకు ఎంతగానో చేరువయ్యాయి. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా రావిర్యాలలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం. 13 వద్ద అందుబాటులో ఉంటే వండర్ లా, శంషాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలోని ఎస్కేప్ అడ్వెంచర్ వాటర్ థీమ్ పార్కు, శంకర్‌పల్లిలోని వైల్డ్ వాటర్ అమ్యూజ్‌మెంట్, వికారాబాద్ సమీపంలో ఉండే డ్రీమ్ వ్యాలీ వాటర్ పార్కులు, వికారాబాద్, భువనగిరి గుట్టల సమీపంలో ఉండే ట్రెక్కింగ్ స్పాట్లకు ప్రైవేటు టూర్ ఆపరేటర్లతోపాటు తెలంగాణ టూరిజం శాఖ కూడా టూర్లను ఆపరేట్ చేస్తున్నది. వీటికి సిటీ నుంచి గంటన్నర వ్యవధిలోనే చేరుకునే వీలు ఉండగా.. ఒకప్పుడు సిటీ దాటి వెళ్లేవారు కూడా ఈ ప్రాంతాలను ఒక్కసారైన సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

## అబ్బురపరిచే పార్కులు..



హైదరాబాద్ శివారులోనే ఉన్న కండ్లకోయ ఆక్సిజన్ పార్కును అడవిలాంటి ఉద్యాన వనం అనవచ్చు. అటవీశాఖ 75 ఎకరాల విస్తీర్ణంలో తీర్చిదిద్దిన ఈ పార్కులో 50 వేల పైచిలుకు చెట్లున్నాయి. పెద్దల కోసం యోగా హాల్, వాక్‌వేలు ఉన్నాయి. పిల్లలకు ఆట స్థలాలున్నాయి. ట్రీహౌస్, పక్షులు సీతాకోకచిలుకల పార్కులు ఉన్నాయి. కుటుంబమంతా కలిసి పిక్నిక్ వెళ్లడానికి చక్కని చోటు ఇది. అలాగే కొత్తగూడలో 120 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బొటానికల్ గార్డెన్స్ ఆహ్లాదాన్ని పంచుతున్నది.





# ఈ ఎలుకలు డ్యామ్ కట్టేస్తాయి!

ఇదిగో ఇక్కడ కనిపిస్తుందే ఆ డ్యామ్ కట్టేసరికి తలప్రాణం తోకకి వచ్చిందనుకో%శా% అన్నది తోకను నిమురుకుంటూ ఓ పెద్ద ఎలుక. ముఖ్యంగా పిల్లర్ల కోసం ఆ పెద్ద దుంగలు నరికే సరికి.. సారీ కొరికే సరికి దుంప తెగిందనుకో అంది మరో మధ్య వయసు నారింజ పండ్ల ఎలుక. ఏదేమైనా అందరం కట్టగట్టుకొని ఆనకట్ట కట్టడం భలే ఆనందం అబ్బా ఇంక మన ఇండ్లకు ఏ కాలమైనా సమస్యే లేదు అంది ఓ చిట్టి ఎలుక. ఇదేం కార్టూన్ సినిమా కథ కాదండీ. నిజంగానే ఈ ఎలుకలు సమష్టిగా పనిచేసి నదుల దగ్గర డ్యామ్‌లు కడతాయి. జీవావరణ ఇంజినీర్లుగా వీటికి పేరుంది. ఇంతకీ ఇవి ఎందుకిలా చేస్తాయి.ఇక్కడి చిత్రాల్లో కనిపిస్తున్న ఎలుకలను బీవర్‌లుగా పిలుస్తారు. అమెరికాతో పాటు, యురేషియా ప్రాంతంలో అంటే ఉత్తరార్ధగోళంలో ఎక్కువగా నివసించే వీటి నైపుణ్యాలు అచ్చెరువొందిస్తాయి. పారే నదులు, నదీ పాయలు, సెలయేళ్లలో ఇవి నివసిస్తాయి.డోమ్‌ల ఆకృతిలో ఉండే వీటి ఇండ్లను నిర్మించుకోవడం కోసం తామే ఆ ధారలో ఓ చోట మడుగులను ఏర్పాటు చేసుకొంటాయి. అందుకోసం నదీ ప్రవాహ వేగాన్ని తగ్గించేందుకు ముందుగా నీటి ప్రవాహం అంచున ఉన్న పెద్దచెట్లను తన బలమైన నారింజ రంగు పండ్లతో కొరికి నేల కూలుస్తాయి.ఇవి తమ పళ్లతో 148 అడుగుల ఎత్తు, 45 అంగుళాల చుట్టుకొలత కలిగిన పెద్ద చెట్లను సైతం పడేసినట్టు రికార్డులున్నాయి. వీటి పళ్లలో ఇనుము ఎక్కువగా ఉండటం వల్ల వీటికా రంగు వస్తుందట. ఆ తర్వాత అన్నీ కలిసి ఆ దుంగలను నీటి ప్రవాహం వైపు నెట్టుకొస్తాయి.దుంగలు నిలబడటానికి తమ రెండు చేతులతో గుండ్రాళ్లు, మట్టిని పోగుచేసి ఒక దగ్గరికి తెస్తాయి. అవన్నీ కుదురుకుని నీటి ప్రవాహం నెమ్మదించాక చెట్ల కొమ్మలు, గులక రాళ్లు, ఇసుక, పుల్లలు, గడ్డి ఇలా అన్నింటినీ వేస్తూ ఒక ఆనకట్టను నిర్మిస్తాయి. దీంతో ఆ భాగం ఇండ్లు కట్టుకోవడానికి అనుకూలంగా మారుతుంది.ఇందులో పుల్లలు, రాళ్లూ ఏరుకొచ్చి బోర్లించిన గూడులా తమ ఇండ్లను కట్టుకుంటాయి. తినడానికి, ఉండటానికి, చలికాలం ఆహారం నిల్వ చేసుకునేందుకు వీలుగా విడివిడి భాగాలుగా నిర్మించుకుంటాయి.వీటి ద్వారాలు మాత్రం నీటిలోపలి నుంచి వెళ్లగలిగేలా మాత్రమే ఉంటాయి. అంటే నేల మీది వీటి శత్రువుల నుంచి తప్పించుకోవడానికన్నమాట. ఇక, ఇలా ఆనకట్ట కట్టి నీటి కొలను ఏర్పరచుకోవడం వల్ల నీటి మట్టం నియంత్రణలో ఉంటుంది. దాంతో గడ్డకట్టే చలిలోనూ అడుగున నీరు ఉండి వీటి రాకపోకలకు ఇబ్బంది ఉండదు. ఇవి ఇలా ఆనకట్ట కట్టడం వల్ల ఆ ప్రాంతంలో చేపలు, కప్పలు, పురుగులతో చక్కటి జీవావరణ వ్యవస్థ కూడా ఏర్పడుతుందట. చలికాలం ముందు డ్యామ్ మెయింటెనెన్స్ పనులను చేసుకుంటాయట బీవర్లు. ప్రకృతిలో ఎన్ని వింతలో కదూ!



# ఇండియాలో 20 బ్రాంచ్‌లను మూసివేస్తున్న స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్

సంపన్నులే టార్గెట్‌గా కొత్త వ్యూహం.. బ్రిటిష్ బ్యాంకింగ్ దిగ్గజం స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ గత ఏడాది కాలంలో భారతదేశంలో తన వ్యూహాత్మక మార్పుల్లో భాగంగా శాఖల సంఖ్యను 100 నుండి 80కి తగ్గించుకుంది. దేశీయ మార్కెట్లో మారుతున్న వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఈ బ్యాంక్ ఇప్పుడు సాధారణ రిటైల్ బ్యాంకింగ్ సేవల కంటే వెల్త్ మేనేజ్‌మెంట్, సంపన్న ఖాతాదారుల విభాగానికి సంబంధించిన సలహా సేవలపై ఎక్కువ శ్రద్ధ వహిస్తోంది. అయినప్పటికీ భారతదేశంలో లోకల్ సబ్సిడరీ (అనుబంధ సంస్థ) రూపంలో కాకుండా నేరుగా వ్యాపారం చేస్తున్న విదేశీ బ్యాంకుల్లో స్టాండర్డ్ చార్టర్డ్ ఇప్పటికీ అతిపెద్ద బ్రాంచ్ నెట్‌వర్క్‌ను కలిగి ఉండటం విశేషంగా చెప్పుకోవచ్చు. బ్యాంకింగ్ కార్యకలాపాలను క్రమబద్ధీకరించే క్రమంలో నగరాల్లో ఒకే విధమైన పనుల కోసం పక్కపక్కనే ఉన్న కొన్ని శాఖలను బ్యాంక్ విలీనం చేసింది. అయితే ఈ శాఖలను మూసివేసినప్పటికీ వాటికి సంబంధించిన లైసెన్సులను బ్యాంకింగ్ నియంత్రణ సంస్థ అయిన ఆర్‌బీఐకి తిరిగి అప్పగించకుండా.. భవిష్యత్తులో ఇతర వృద్ధి కేంద్రాల్లో వాటిని ఉపయోగించుకునే అవకాశాలను బ్యాంక్ పరిశీలిస్తోంది. ప్రస్తుతం స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ ఒకే-ఉత్పత్తి విధానం నుండి బహుళ-ఉత్పత్తి విధానానికి మారుతూ సంపన్న, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) వ్యాపారాల వృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించింది. ఈ వ్యూహంలో భాగంగానే తన ప్రస్తుత శాఖల్లో ఉన్న 'ప్రాధాన్యతా కేంద్రాల' నెట్‌వర్క్‌ను ప్రస్తుతమున్న 20 నుండి 2026 చివరి నాటికి సుమారు 30కి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కస్టమర్లకు అంతర్జాతీయ స్థాయి బ్యాంకింగ్ అనుభవాన్ని అందించేందుకు సాంకేతికతను ఉపయోగించుకోవడంతో పాటు రిలేషన్‌షిప్ మేనేజర్ల సంఖ్యను పెంచడంపై భారీగా పెట్టుబడులు పెడుతోంది.ూశ్రీంశీ =ము ఎణఖీజ బ్యాంక్ కస్టమర్లకు షాక్.. రుణాలపై వడ్డీ రేట్లు పెంపు..జువీ×లు భారీగా పెరిగే అవకాశం.. గత కొన్నేళ్లుగా స్టాండర్డ్ చార్టర్డ్ తన రిటైల్ ఆస్తులను విక్రయిస్తూ వస్తోంది. ఇందులో భాగంగా తన పర్సనల్ లోన్ వ్యాపారానికి సంబంధించిన సుమారు రూ. 4,100 కోట్ల బకాయి రుణాలను కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు విక్రయించగా.. ఈ ఏడాది ఏప్రిల్‌లో దాదాపు 4.5 లక్షల మంది క్రెడిట్ కార్డ్ కస్టమర్లను ఫెడరల్ బ్యాంక్‌కు బదిలీ చేయాలని నిర్ణయించింది. అయితే కార్డ్ వ్యాపారం నుండి బ్యాంక్ పూర్తిగా వైదొలగడం లేదు.. ఎందుకంటే పలు ఇతర సేవల కింద ఇప్పటికీ 1.5 లక్షల నుండి 2.5 లక్షల వరకు కార్డులను తన వద్దే ఉంచుకుంది.భారతదేశంలో గృహ రుణాలు (తనఖాలు), అసురక్షిత రుణాల విభాగాలలో దేశీయ బ్యాంకుల నుండి ఎదురవుతున్న తీవ్రమైన పోటీ కారణంగా ఇటీవలి కాలంలో విదేశీ బ్యాంకులు తమ రిటైల్ వ్యాపారాలను విక్రయించుకుంటున్నాయి. ఉదాహరణకు 2023లో సిటీ బ్యాంక్ తన భారతీయ వినియోగదారుల వ్యాపారాన్ని (క్రెడిట్ కార్డులు, రిటైల్ బ్యాంకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్) రూ. 11,603 కోట్లకు యాక్సిస్ బ్యాంక్‌కు విక్రయించింది. అలాగే, డాయిచే బ్యాంక్ కూడా భారతదేశంలోని తన రిటైల్ బ్యాంకింగ్, ప్రైవేట్ బ్యాంకింగ్ వ్యాపారాలను కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు రూ. 282 కోట్లకు విక్రయించడానికి నిర్ణయించుకుంది. ఇలాంటి మరొక విదేశీ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌ఎస్‌బిసి మాత్రం భిన్నమైన వ్యూహాన్ని అవలంబించింది. గతంలో 2016లో తన శాఖలను 50 నుండి 26కి తగ్గించుకున్న ఈ బ్యాంక్.. తిరిగి 2025లో అమృత్‌సర్, భోపాల్, భువనేశ్వర్ వంటి కీలక నగరాల్లో కొత్తగా 20 శాఖలను తెరవాలని నిర్ణయించడం గమనార్హం.




# బ్యాంక్ ఆఫ్ బరోడా, జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌కు బిగ్ షాక్

నిబంధనల ఉల్లంఘనపై రూ. 66.7 లక్షల జరిమానా.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన నిబంధనలను కఠినంగా అమలు చేయడంలో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థ అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లపై భారీ జరిమానాలు విధించింది. రుణదాతల కోసం సరసమైన పద్ధతుల నియమావళి తో పాటు 'మీ కస్టమర్‌ను తెలుసుకోండి మార్గదర్శకాలలోని కీలక నిబంధనలను పాటించనందుకు బ్యాంక్ ఆఫ్ బరోడాపై రూ. 63.6 లక్షల జరిమానా విధించినట్లు కేంద్ర బ్యాంకు ప్రకటించింది. అదేవిధంగా, కేవైసీ నిబంధనల ఉల్లంఘనకు గాను జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు కూడా రూ. 3.1 లక్షల జరిమానా విధించింది. ఈ రెండు సంస్థలపై ఆర్‌బీఐ తీసుకున్న సమిష్టి చర్యల వల్ల మొత్తం రూ. 66.7 లక్షల జరిమానా నమోదైంది. ఈ చర్యలకు గల కారణాలను వివరిస్తూ.. మార్చి 31, 2025 నాటి ఆర్థిక స్థితికి సంబంధించి బ్యాంక్ ఆఫ్ బరోడాపై ఆర్‌బీఐ పర్యవేక్షక మూల్యాంకనం కోసం చట్టబద్ధమైన తనిఖీని నిర్వహించిందని స్పష్టం చేసింది. ఈ తనిఖీలలో లోపాలను గుర్తించిన తర్వాత, బ్యాంకుకు ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని కోరుతూ 'షోకాజ్' నోటీసు జారీ చేసింది. ఆ నోటీసుకు బ్యాంక్ ఆఫ్ బరోడా సమర్పించిన లిఖితపూర్వక సమాధానాన్ని, వ్యక్తిగత విచారణలో వారు అందించిన వివరణలను ఆర్‌బీఐ నిశితంగా పరిశీలించింది. ఆ తర్వాత, ఈ ప్రభుత్వ రంగ బ్యాంకు కొన్ని రుణ ఖాతాలలో వినియోగదారులతో కుదుర్చుకున్న ఒప్పంద వడ్డీ రేటు కంటే ఎక్కువ వడ్డీని వసూలు చేసినట్లు, కొంతమంది కస్టమర్ల కేవైసీ రికార్డులను నిర్ణీత కాలపరిమితిలోగా సెంట్రల్ కేవైసీ రికార్డ్స్ రిజిస్ట్రీ కి అప్‌లోడ్ చేయడంలో విఫలమైనట్లు ఆర్‌బీఐ నిర్ధారించింది. మరోవైపు జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్ విషయానికొస్తే.. 2025 మార్చి 31 నాటికి ఉన్న ఆ సంస్థ ఆర్థిక స్థితి ఆధారంగా నేషనల్ హౌసింగ్ బ్యాంక్ ఒక చట్టబద్ధమైన తనిఖీని నిర్వహించింది. ఈ తనిఖీ నివేదిక ఆధారంగా జారీ చేసిన నోటీసుకు సంస్థ ఇచ్చిన సమాధానాన్ని పరిశీలించిన ఆర్‌బీఐ, కస్టమర్ ఖాతాల రిస్క్ వర్గీకరణను కనీసం ఆరు నెలలకు ఒకసారి క్రమానుగతంగా సమీక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయడంలో ఈ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ విఫలమైందని గుర్తించింది. ఈ కారణంతోనే జీఐసీ సంస్థపై కూడా జరిమానా వేటు పడింది.




ూశ్రీంశీ రూ.20 లక్షల పెట్టుబడి.బాండ్‌లో ఏది ఎక్కువ రాబడి ఇస్తుంది..సీనియర్ సిటిజన్లకు బెస్ట్ గైడ్. అయితే ఈ రెండు సందర్భాల్లోనూ కేంద్ర బ్యాంకు ఒక ముఖ్యమైన స్పష్టతనిచ్చింది. ఈ జరిమానాలు కేవలం నియంత్రణ నిబంధనలు, నిరంతర పర్యవేక్షణ లోపాల విధించినట్లు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అంతేగానీ ఆయా ఆర్థిక సంస్థలు తమ వినియోగదారులతో కుదుర్చుకున్న ఏదైనా నిర్దిష్ట లావాదేవీ లేదా కుదుర్చుకున్న ఒప్పందాల యొక్క చట్టబద్ధమైన చెల్లుబాటుపై తీర్పు చెప్పే ఉద్దేశం లేదా ప్రభావం వీటికి ఉండదని, దీనివల్ల కస్టమర్ల సాధారణ సేవలపై ఎలాంటి ప్రభావం పడదని స్పష్టం చేసింది. బ్యాంకింగ్ రంగంలో పారదర్శకతను పెంచడానికి ఆర్‌బీఐ నిరంతరం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగానే ఇటీవల గడిచిన ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్ లు కలిసి ప్రభుత్వానికి మొత్తం రూ. 7,023 కోట్ల భారీ డివిడెండ్‌ను చెల్లించాయి. అయినప్పటికీ, కస్టమర్ల ప్రయోజనాలను రక్షించడంలో, ఆర్థిక క్రమశిక్షణను పాటించడంలో బ్యాంకుల లాభనష్టాలతో సంబంధం లేకుండా ఆర్‌బీఐ కఠినంగా వ్యవహరిస్తోందని ఈ తాజా జరిమానాలు నిరూపిస్తున్నాయి. ముఖ్యంగా వినియోగదారులపై అదనపు వడ్డీ భారం వేయడం, కేవైసీ అప్‌లోడ్‌లలో ఆలస్యం చేయడం వంటి ఐటి, విధానపరమైన లోపాలపై కేంద్ర బ్యాంకు ఏమాత్రం రాజీపడటం లేదు.

# బెంగళూరులో రూ. 500తో రోజంతా గడపడం సాధ్యమేనా

## ఈ యువతి ఏం చేసిందో చూడండి!

భారతదేశంలో అత్యంత ఖరీదైన నగరాల్లో బెంగళూరు ఒకటి. ఇక్కడ అడుగు పెడితే చాలు.. క్యాబ్ చార్జీల దగ్గర నుంచి హోటల్ బిల్లుల వరకు అన్నీ చుక్కలు చూపిస్తుంటాయి. సామాన్యుడు ఇక్కడ సర్వైవ్ అవ్వడం అంత ఈజీ కాదనేది అందరి మాట. అయితే, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రియాంక మొండల్ అనే యువతి ఈ అంచనాలను తిరగరాసింది. కేవలం 500 రూపాయల బడ్జెట్‌తో గార్డెన్ సిటీలో ఒక రోజంతా గడపగలమా? అనే ఆసక్తికరమైన ప్రయోగాన్ని చేసి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.తక్కువతో మొదలై.. మెట్రోతో సాగి..ప్రియాంక తన రోజును చాలా సింపుల్‌గా ప్రారంభించింది. ఉదయం టిఫిన్ కోసం తక్కువ ధరలో దొరికే ఇడ్లీలను ఎంచుకుంది. ఇక రవాణా విషయానికి వస్తే, బెంగళూరులో ఊబర్, ఓలా వంటి క్యాబ్‌లు బుక్ చేస్తే వందల రూపాయలు ఖర్చవుతాయని అందరికీ తెలిసిందే. అందుకే ఆమె తెలివిగా మెట్రో రైలును ఆశ్రయించింది. దీనివల్ల ప్రయాణ ఖర్చులు భారీగా తగ్గాయి. మధ్యలో ఒక చిన్న టీ బ్రేక్ తీసుకుంటూ తన ప్రయాణాన్ని కొనసాగించింది. బెంగళూరులో రూ. 5 వేలకే రూమ్..ఈ ఏరియాలోకి రమ్మని పిలుస్తున్న ఇంటి ఓనర్లు..లంచ్ టైమ్ షాక్!అయితే, మధ్యాహ్నం భోజనం సమయానికి ప్రియాంకకు అసలైన సవాలు ఎదురైంది. బెంగళూరు లోని ఒక హోటల్‌లో మెనూ చూడగానే రేట్లు చూసి ఆమె ఒక్కసారిగా షాక్‌కు గురైంది. సామాన్యమైన భోజనం కూడా చాలా కాస్ట్లీగా అనిపించింది. అయినప్పటికీ, వెనక్కి తగ్గకుండా తన బడ్జెట్ పరిమితిని దృష్టిలో పెట్టుకుని, కేవలం 120 రూపాయలలోనే తన లంచ్ పూర్తి చేసింది. పక్కా ప్లానింగ్ ఉంటే ఏదైనా సాధ్యమేనని ఆమె నిరూపించింది.మిగిలిన డబ్బుతో సేఫ్..సాయంత్రం వేళ ఆకలి వేసినప్పుడు భారీ రెస్టారెంట్లకు వెళ్లకుండా, ఒక వడపావ్ , టీతో సరిపెట్టుకుంది. అప్పటికే తన బడ్జెట్ దాదాపు అయిపోవచ్చని గ్రహించిన ప్రియాంక, వెంటనే ఇంటికి తిరుగు ప్రయాణమైంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటం టే, 500 రూపాయల బడ్జెట్ పెట్టుకుంటే, రోజు చివరలో ఆమె చేతిలో ఇంకా 200 రూపాయలు మిగిలాయి. అంటే కేవలం 300 రూపాయలతోనే ఆమె తన రోజును విజయవంతంగా ముగించింది .సోషల్ మీడియా స్పందన ప్రియా ఒక షేర్ చేసిన ఈ వీడియోపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. "ఇందిరా క్యాంటీన్లకు వెళ్తే కేవలం 30 రూపాయలకే భోజనం దొరుకుతుంది, ఇంకా తక్కువలో పూర్తి చేయొచ్చు" అని కొందరు సలహాలు ఇస్తుంటే, "మేము కూడా ఇలాంటి బడ్జెట్ ప్లానింగ్ పాటిస్తాం" అని మరికొందరు కామెంట్ చేస్తున్నారు. యాపిల్ కంపెనీలో ఉద్యోగం.. లక్షల్లో జీతం.. కానీ ఈ టెక్కీ ఆటో ఎందుకు నడుపుతున్నాడో తెలుసా యాపిల్ కంపెనీలో ఉద్యోగం.. లక్షల్లో జీతం.. కానీ ఈ టెక్కీ ఆటో ఎందుకు నడుపుతున్నాడో తెలుసామొత్తానికి, ఎంత ఖరీదైన నగరమైనా సరే, అనవసర ఖర్చులకు పోకుండా ప్లాన్ చేసుకుంటే తక్కువతో బతకడం సాధ్యమేనని ప్రియాంక స్టోరీ నిరూపిస్తోంది. బెంగళూరు లాంటి నగరాల్లో జీవన ప్రమాణాలు పెరగడం వల్ల ఖర్చులు ఆకాశాన్ని తాకుతున్న మాట నిజమే. అయితే, విలాసాల కంటే అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ.. క్యాబ్‌లకు బదులు మెట్రో, స్టార్ హోటళ్లకు బదులు స్థానిక టిఫిన్ సెంటర్లను ఎంచుకుంటే ఖచ్చితంగా డబ్బు ఆదా చేయవచ్చు. ఈ వీడియో చూసిన నెటిజన్లు కూడా "ఖర్చు అనేది మనం ఉండే నగరం మీద మాత్రమే కాదు, మనం చేసే ఖర్చు చేసే పద్ధతి మీద కూడా ఆధారపడి ఉంటుంది" అని అభిప్రాయపడుతున్నారు




# హైదరాబాద్‌లో డ్రైవర్ లేని పాడ్ టాక్సీలు! ఆ ఏరియా వాళ్లకు పండగే!



## హైదరాబాద్ అంటేనే ఐటీ హబ్

హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏరియాల్లో ఉదయం, సాయంత్రం ఆఫీసు వేళల్లో ట్రాఫిక్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మెట్రో స్టేషన్ వరకు బానే చేరుకుంటున్నాం కానీ, అక్కడ దిగాక ఆఫీసుకి వెళ్లడానికి సరైన రవాణా సౌకర్యం లేక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ఈ 'లాస్ట్ మైల్ కనెక్టివిటీ' సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఒక అద్భుతమైన ప్లాన్ తో ముందుకు వచ్చింది. అదే 'పర్సనల్ రాపిడ్ ట్రాన్సిట్' లేదా మనం వాడుక భాషలో చెప్పుకునే 'పాడ్ టాక్సీలు'.ఏమిటీ పాడ్ టాక్సీ ప్రాజెక్ట్‌పాడ్ టాక్సీలు అంటే డ్రైవర్ అవసరం లేని చిన్నపాటి ఎలక్ట్రిక్ వాహనాలు. ఇవి ప్రత్యేకంగా నిర్మించిన ట్రాక్‌లపై (ఎలివేటెడ్ కారిడార్స్) నడుస్తాయి. ఇవి చూడటానికి చిన్న కార్లలా ఉండి, ఒకేసారి నలుగురు నుంచి ఆరుగురు ప్రయాణించడానికి వీలుగా ఉంటాయి. మీరు మెట్రో స్టేషన్ దిగిన వెంటనే ఈ పాడ్ టాక్సీ ఎక్కి నేరుగా మీ ఆఫీసు వద్దకో లేదా నిర్దేశించిన పాయింట్ వద్దకో చేరుకోవచ్చు. రియల్ ఎస్టేట్‌లో మారిన లెక్కలు! బెంగళూరు, హైదరాబాద్‌లో ట్రెండ్ ఎలా ఉందంటే..ఏ ఏ ప్రాంతాలను కలుపుతుందిప్రస్తుత ప్లాన్ ప్రకారం, హైదరాబాద్‌లోని అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలను ఈ నెట్‌వర్క్ అనుసంధానిస్తుంది. ముఖ్యంగా..హైటెక్ సిటీ , రాయదుర్గం మెట్రో స్టేషన్లు. నాలెడ్జ్ సిటీ , ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్. తెలంగాణ రాష్ట్ర సచివాలయం పరిసరాలు. రాయదుర్గం నుంచి కూకట్‌పల్లి కారిడార్.ఈ ప్రాంతాలన్నీ ఐటీ కంపెనీలు, పెద్ద పెద్ద వ్యాపార సముదాయాలతో నిండి ఉంటాయి. ఇక్కడ ఫుట్‌ఫాల్ (జనాల తాకిడి) చాలా ఎక్కువ. కాబట్టి, ఈ ప్రాంతాల్లో పాడ్ టాక్సీలు అందుబాటులోకి వస్తే సామాన్యులకు, ఉద్యోగులకు ప్రయాణం చాలా సులువు అవుతుంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ జోరు! అలాంటి ఇళ్లకే ఫుల్ డిమాండ్!ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితి ఏమిటిఈ భారీ ప్రాజెక్ట్ కోసం ఇప్పటికే ముగ్గురు కన్సల్టెంట్స్ (ూజూా ూంంశీఎఱఖీవం, బిడ్లు దాఖలు చేశారు. వీరు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, ప్రాజెక్ట్ ఎంత వరకు లాభదాయకం? ఎక్కడెక్కడ ట్రాకులు నిర్మించాలి? సాంకేతికత ఎలా ఉండాలి? అనే అంశాలపై నివేదిక ఇస్తారు. ఈ ప్రాజెక్టును పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అంటే ప్రభుత్వం , ప్రైవేట్ సంస్థలు కలిసి దీనిని నిర్మించి, నిర్వహిస్తాయి.ప్రయాణికులకు కలిగే ప్రయోజనాలుసాధారణ బస్సులు లేదా ఆటోల కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా, ఈ పాడ్ టాక్సీలు నిరంతరం అందుబాటులో ఉంటాయి. ఇది ఎలక్ట్రిక్ వాహనం కావడం వల్ల కాలుష్యం ఉండదు. పైగా, గాలిలో ప్రత్యేక ట్రాక్‌లపై వెళ్తాయి కాబట్టి కింద రోడ్డుపై ఉండే ట్రాఫిక్ జామ్‌లతో అస్సలు సంబంధం ఉండదు. ముంబై వంటి నగరాల్లో కూడా ఇలాంటి ప్రాజెక్టుల గురించి చర్చ జరుగుతోంది, కానీ హైదరాబాద్ నగరం ఈ విషయంలో ఒక అడుగు ముందే ఉంది. త్వరలోనే ఈ కల సాకారమైతే, భాగ్యనగరం ప్రపంచ స్థాయి నగరాల జాబితాలో మరో మెట్టు ఎక్కుతుంది.

# భారత్‌లోకి భారీగా పెట్టుబడులు

**' డిక్లరేషన్'కు 88 దేశాల సంతకాలు అశ్వినీ వైష్ణవ్**

**దిల్లీ వేదికగా జరిగిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో**

**దిల్లీ డిక్లరేషన్‌కు ఏకగ్రీవ ఆమోదం**



కృత్రిమ మేధ భవిష్యత్తుపై అంతర్జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం కుదిరింది. భారత్ నేతృత్వంలో జరిగిన 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో రూపొందించిన 'దిల్లీ డిక్లరేషన్' కు ప్రపంచ అగ్రరాజ్యాలైన అమెరికా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్, రష్యాతో సహా మొత్తం 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు తమ మద్దతును తెలిపినట్లు కేంద్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఏఐ లక్ష్యాల సహకారంలో ఇదొక మైలురాయిగా పేర్కొన్నారు. ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు దిల్లీలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు.ప్రధాని మోదీ ప్రతిపాదించిన "హ్యూమన్-సెంట్రిక్ ఏఐ" విజన్‌ను ప్రపంచ దేశాలు స్వీకరించాయని కేంద్ర మంత్రి వివరించారు. ఏఐ సాంకేతికత ప్రయోజనాలు కేవలం కొద్ది దేశాలకు లేదా సంస్థలకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలకు అందేలా చేయాలని అన్ని దేశాలు అంగీకరించాయని ఆయన తెలిపారు. భారతీయ సంస్కృతిలో మూల సూత్రమైన 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అనే మంత్రాన్ని ఏఐ టెక్నాలజీ అమలులో అంతర్జాతీయ సూత్రంగా ఈ సదస్సు గుర్తించినట్లు చెప్పారు. అమెరికా, చైనా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, ఇటలీ, ఇజ్రాయెల్, జర్మనీ, సింగపూర్, దక్షిణ కొరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఉక్రెయిన్, యూరోపియన్ యూనియన్, వంటి దేశాలు ఈ డిక్లరేషన్‌పై సంతకాలు చేశాయి. పొరుగు దేశాలైన నేపాల్, శ్రీలంక, భూటాన్ కూడా ఇందులో భాగస్వాములయ్యాయి."దిల్లీలో జరిగిన 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' అంతర్జాతీయ సహకారంలో ఒక మైలురాయిని అధిగమించింది. 'దిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్' ఏకగ్రీవ ఆమోదంతో ముగిసింది. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని వినియోగించుకోవడంలో అంతర్జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం కుదిరింది. మొత్తం 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు ఈ డిక్లరేషన్‌ను ఆమోదించాయి."- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ప్రపంచ దేశాలన్నీ ఏకగ్రీవంగా భారత్ పక్షాన నిలవడం గర్వకారణంగా ఉందని మంత్రి తెలిపారు. ఏఐ వనరులను కేవలం కొన్ని ధనిక దేశాలు లేదా కొన్ని కార్పొరేట్ సంస్థలకే పరిమితం చేయకుండా, వాటిని ప్రజాస్వామ్యబద్ధం చేయాలని తాము కోరినట్లు చెప్పారు. ఈ సాంకేతికత ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి, ప్రపంచంలోని ప్రతి మూలకు చేరాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ దార్శనికతను ప్రపంచం ఇప్పుడు అధికారికంగా ఆమోదించిందన్నారు.గ్లోబల్ సౌత్ నుంచి తొలి అడుగుఏఐ సాంకేతికతపై సాధారణంగా అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల్లోనే చర్చలు జరుగుతుంటాయి. అయితే, గ్లోబల్ సౌత్ నుంచి ఇటువంటి భారీ ఏఐ సదస్సును నిర్వహించిన ఘనత భారత్‌కు దక్కింది. అభివృద్ధి చెందుతున్న దేశాల అవసరాలను, అక్కడ ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఏఐ పాలన, భద్రత వంటి అంశాలపై దిల్లీ వేదికగా విస్తృతమైన చర్చలు జరిగాయి. ఈ సదస్సు కేవలం ఆయా దేశాల ప్రభుత్వాలే కాకుండా, ప్రపంచ ప్రసిద్ధ టెక్నాలజీ కంపెనీల నిపుణులు, ఇన్నోవేటర్లు, సివిల్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు. భారతదేశం నుంచి స్టార్టప్ వ్యవస్థాపకులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించి, భారతీయ మేధాశక్తిని ప్రపంచానికి పరిచయం చేశారు.ఏఐ సదస్సులో ప్రధానంగా చర్చించిన అంశాలు ఇవే!ఏఐ వల్ల తలెత్తే ముప్పులను ఎలా అరికట్టాలి? డీప్ ఫేక్స్ వంటి సమస్యలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై సభ్య దేశాలు ఒక అవగాహనకు వచ్చాయి.విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి రంగాల్లో ఏఐని సామాన్యుడికి ఉపయోగపడేలా ఎలా మార్చాలి అనే అంశంపై దృష్టి సారించారు.ఏఐ రాకతో ఉపాధి కోల్పోయే ప్రమాదం లేకుండా, ప్రజలకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఎలా అందించాలి అనే దానిపై రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు.ఏఐ అల్గారిథమ్స్ పారదర్శకంగా ఉండాలని, ఎటువంటి వివక్షకు తావు ఇవ్వకూడదని డిక్లరేషన్‌లో స్పష్టం .

# ఈపీఎఫ్‌ఓ ఖాతాదారులకు గుడ్‌న్యూస్

**ఇక డబ్బులు విత్ డ్రా త్వరలోనే కొత్త యాప్**

**ఈపీఎఫ్‌ఓ కీలక నిర్ణయం**

**యుపీఐ ద్వారా నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి డబ్బులు**

**క్లెయిమ్ దరఖాస్తుల బెడద ఇక ఉండదు**

**కొత్త మొబైల్ యాప్ ట్రయల్స్ షురూ**

**ఏప్రిల్ నుంచి అందుబాటులోకి**




దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఉద్యోగులకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) శుభవార్త చెప్పింది. అత్యవసర సమయాల్లో పీఎఫ్ డబ్బులు తీసుకోవడానికి రోజుల తరబడి ఎదురుచూసే పని లేకుండా, ఇకపై క్షణాల్లోనే డబ్బును విత్‌డ్రా చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తేనుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కొత్తగా రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా, 'యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్' సాయంతో పీఎఫ్ సభ్యులు తమ డబ్బును నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ చేసుకోవచ్చు.సరికొత్త యాప్, అద్భుతమైన ఫీచర్లుప్రస్తుతం పీఎఫ్ సేవలు ఉమాంగ్ యాప్ లేదా యూఏఎన్ పోర్టల్ ద్వారా అందుతున్నాయి. కానీ రాబోయే కొత్త యాప్ పూర్తిగా దీనికోసమే ప్రత్యేకంగా ఉంటుంది. ఈ యాప్‌లో సభ్యులు తమ ఖాతాలో ఎంత బ్యాలెన్స్ ఉందో చూసుకోవచ్చు. అందులో ఎంత మొత్తం విత్‌డ్రా చేసుకోవడానికి అర్హత ఉందో స్పష్టంగా కనిపిస్తుంది. బ్యాంక్ ఖాతాకు లింక్ అయిన యూపీఐ పిన్ ఉపయోగించి, సురక్షితంగా ఆ డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. పాస్‌బుక్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం, ఇతర సేవలు కూడా ఇందులో మరింత సులభంగా ఉంటాయి. పాత పద్ధతిలో క్లెయిమ్ ఫారం నింపి, అప్లై చేసే తిప్పలు తప్పుతాయి.ట్రయల్స్ మొదలయ్యాయిఈ కొత్త విధానం ఎలా పనిచేస్తుందో పరీక్షించడానికి ఈపీఎఫ్ఓ ఇప్పటికే రంగంలోకి దిగింది. సుమారు 100 డమ్మీ ఖాతాలతో ప్రస్తుతం ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. ఇందులో ఏవైనా సాంకేతిక లోపాలు ఉంటే సరిచేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏప్రిల్‌లో ఈ యాప్‌ను ఘనంగా ప్రారంభించేందుకు కేంద్ర కార్మిక శాఖ సన్నాహాలు చేస్తోంది.ఎంత డబ్బు తీసుకోవచ్చు అయితే పీఎఫ్ ఖాతాలోని మొత్తం డబ్బును యూపీఐ ద్వారా తీసుకునే వీలుండదు. ఖాతాలోని కొంత మొత్తాన్ని ఫ్రీజ్ చేస్తారు. అంటే అది భవిష్యత్తు అవసరాల కోసం ఉంటుంది. మిగిలిన పెద్ద మొత్తాన్ని మాత్రం సభ్యులు తమ అవసరాలకు అనుగుణంగా యూపీఐ ద్వారా వాడుకోవచ్చు. అనారోగ్యం, చదువు, పెళ్లిళ్లు, ఇళ్లు కట్టుకోవడం వంటి అత్యవసరాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.ప్రస్తుత సమస్యలుఇప్పుడున్న విధానంలో పీఎఫ్ డబ్బులు రావాలంటే క్లెయిమ్ అప్లై చేయాలి. అది ప్రాసెస్ అయ్యి డబ్బులు రావడానికి సమయం పడుతుంది. ఏటా సుమారు 5 కోట్ల క్లెయిమ్స్ వస్తున్నాయి. వీటిని పరిష్కరించడం ఈపీఎఫ్ఓకు పెద్ద భారం. ఈ టైమ్ టేకింగ్ ప్రాసెస్‌ను తగ్గించడానికే కొత్త యాప్‌ను తెస్తున్నారు. దీనివల్ల సభ్యులకు సమయం ఆదా అవుతుంది, అధికారులకు పని భారం తగ్గుతుంది.ఆటో సెటిల్మెంట్ మోడ్ఇప్పటికే ఈపీఎఫ్ఓ ఆటో సెటిల్మెంట్ మోడ్ ద్వారా సేవలను వేగవంతం చేసింది. దీని ద్వారా మాన్యువల్ ప్రమేయం లేకుండానే కంప్యూటర్ ద్వారా 3 రోజుల్లో క్లెయిమ్స్ పరిష్కారం అవుతున్నాయి. గతంలో దీని పరిమితి రూ.1 లక్షగా ఉండేది. ఇప్పుడు దాన్ని రూ.5 లక్షలకు పెంచారు. కోవిడ్ సమయంలో ప్రవేశపెట్టిన ఈ విధానం ఇప్పుడు ఎంతో మందికి ఆసరాగా నిలుస్తోంది.బ్యాంకులతో పోటీగా ఈపీఎఫ్ఓకు బ్యాంకింగ్ లైసెన్స్ లేదు కాబట్టి నేరుగా ఏటీఎంలా డబ్బులు ఇవ్వలేదు. కానీ ప్రభుత్వం మాత్రం ఈపీఎఫ్ఓ సేవలను బ్యాంకుల స్థాయికి తీసుకురావాలని భావిస్తోంది. అందులో భాగంగానే ఈ యూపీఐ ఆధారిత విత్‌డ్రాయల్ సౌకర్యాన్ని తీసుకొస్తోంది. దేశంలోని దాదాపు 8 కోట్ల మంది పీఎఫ్ సభ్యులకు ఇది నిజంగానే ఒక శుభవార్త అని చెప్పవచ్చని సంబంధిత వర్గాలు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



## పెళ్లి తర్వాత తిరుపతికి.. నిధి అగర్వాల్ కామెంట్స్

ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నడుస్తోంది. గత కొన్నాళ్లలో చూసుకుంటే రష్మిక, సమంత తదితరుల వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. ఓ పక్క సినిమాలు చేసుకుంటూ మరోవైపు ఫ్యామిలీ లైఫ్ కూడా ఎంజాయ్ చేస్తున్నారు. ఇప్పుడీ లిస్టులో టాలీవుడ్ హీరోయిన్ నిధి అగర్వాల్ కూడా చేరేలా కనిపిస్తోంది. తాజాగా తన పెళ్లి గురించి హింట్ ఇచ్చేలా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఓ మొబైల్ స్టోర్ ఓపెనింగ్ కోసం తాజాగా తిరుపతిలో సందడి చేసిన నిధి అగర్వాల్.. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'పెళ్లి తర్వాత తిరుపతికి వస్తాను. ప్రస్తుతానికి వివాహం గురించి ప్లాన్స్ ఏం లేవు. ఇంకా పెళ్లి కొడుకు దొరకలేదు. ప్రస్తుతం హిందీ, తెలుగులో తలో రెండు సినిమాలు చేస్తున్నాను' అని చెప్పుకొచ్చింది. నిధి అగర్వాల్ కెరీర్ విషయానికొస్తే.. హిందీలో తొలుత హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో అయితే సవ్యసాచి, మిస్టర్ మజ్ను, ఇస్మార్ట్ శంకర్, రాజాసాబ్, హరిహర వీరమల్లు తదితర మూవీస్ చేసింది. కానీ వీటిలో 'ఇస్మార్ట్ శంకర్' తప్పితే ఈమెకు మరో సక్సెస్ అనేది లేకుండా పోయింది. గతేడాది రిలీజైన హరిహర వీరమల్లు, ఈ ఏడాది ప్రారంభంలో వచ్చిన రాజాసాబ్ చిత్రాలపై బోలెడన్ని ఆశలు పెట్టుకుంది కానీ అవి డిజాస్టర్స్ అయ్యాయి. చూస్తుంటే త్వరలో పెళ్లి వార్త ఏమైనా చెబుతుందేమో?



## అవినీతిపరులకు సింహస్వప్నం

అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 'చీదీఖ 111'(వర్కింగ్ టైటిల్)లో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆమె పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నట్లు వార్తలు కూడా వచ్చాయి. తన లేటెస్ట్ ఇంటర్వ్యూలో ఆ పాత్ర గురించి కాజల్ మాట్లాడారు. బాలకృష్ణ 'నేలకొండ భగవంత్ కేసరి' సినిమాలో ఫన్నీగా కనిపించిన తాను, 'చీదీఖ 111'లో మాత్రం సీరియస్ పాత్ర పోషిస్తున్నట్టు ఆ ఇంటర్వ్యూలో కాజల్ పేర్కొన్నారు.చీవషం ఫిల్మ్‌వర్గాల సమాచారం ప్రకారం ఇందులో ఆమె నిజాయతీ గల ప్రభుత్వ అధికారిగా కనిపిస్తుందట. అవినీతిపరుల గుండెల్లో వణుకు పుట్టించేలా ఆ పాత్ర సాగుతుందని ఇన్‌సైడ్ టాక్. ఇందులో బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్ సీన్స్ భావోద్వేగపూరితంగా ఉంటాయట. కాజల్ కెరీర్‌లో ఇప్పటివరకూ కనిపించని భిన్నమైన పాత్ర ఇదని తెలుస్తున్నది. నిజానికి ఈ పాత్రకు ముందు నయనతారను అనుకున్నారు. కానీ కొన్ని కారణాలవల్ల ఆమె స్థానంలో కాజల్ వచ్చి చేరింది. మలినేని గోపీచంద్ దర్శకత్వంలో వెంకటసతీశ్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.





## 'వదలా' సినిమా మిమ్మల్ని వదలదు

ప్రముఖ నటుడు జగపతిబాబు లీడ్ రోల్ పోషిస్తున్న సస్పెన్స్ ఫ్యామిలీ థ్రిల్లర్ 'వదలా'. లయ, హృతికా శ్రీనివాస్ కీలక పాత్రధారులు. ఆకెళ్ల .వి కృష్ణ దర్శకుడు. కిశోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ నిర్మాతలు. ఈ నెల 17న సినిమా విడుదల కానున్నది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. 'చాలా రోజుల తర్వాత నేను సోలోగా చేసిన సినిమా ఇది. ఈ థ్రిల్లర్ సినిమాలో నాకు ఇద్దరు హీరోయిన్లు కూడా ఉన్నారు. 'వదలా' అనేది క్యాచీ టైటిల్. ఈ సినిమా కథపై నాకు అపారమైన నమ్మకం. టైటిట్‌కి తగ్గట్టే ఈ సినిమా మిమ్మల్ని వదలదు.వీశీజఅవం ఇది మంచి ఫ్యామిలీ థ్రిల్లర్. అలాగే మంచి డ్రామా కూడా ఉంది. తప్పకుండా సినిమా అందర్నీ అలరిస్తుంది' అని జగపతిబాబు నమ్మకం వెలిబుచ్చారు. జగపతిబాబుతో మళ్లీ నటించడం పట్ల నటి లయ ఆనందం వ్యక్తం చేశారు. తమ సంస్థలో ఎన్నో చిత్రాలు నిర్మించామని, తొలిసారి థ్రిల్లర్ చేశామని, ఆదరిస్తారని నమ్మకంతో ఉన్నామని నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ అన్నారు. ఈ సినిమాకు కర్త, కర్మ, క్రియ మొత్తం జగపతిబాబేనని, ప్రాణం పెట్టి ఈ సినిమా చేశారని, కథ, కథనం, విషయాల్లోనే కాక, సాంకేతికంగా కూడా సినిమా అందర్నీ ఆకట్టుకుంటుందని దర్శకుడు ఆకెళ్ల వి.కృష్ణ నమ్మకంగా చెప్పారు. ఇంకా హృతికా శ్రీనివాస్ కూడా మాట్లాడారు.



## డిసెంబర్‌తో బన్నీ పార్ట్ పూర్తి?

ప్రస్తుతం అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ 'రాకా' షూట్‌లో బిజీగా ఉన్నారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం హైదరాబాద్ కేంద్రంగా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఇందులో విభిన్న కోణాలతో కూడిన పాత్రను బన్నీ పోషిస్తున్నారు. సైన్స్‌ఫిక్షన్ నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయి సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో దీపిక పదుకోన్ కథానాయిక. మృణాల్‌ఠాకూర్, జాన్వీ కపూర్ ప్రత్యేక పాత్రలు పోషిస్తున్నట్టు సమాచారం. ఇటీవలే విడుదలైన తోడేలు చేతులతో కూడిన బన్నీ ఫస్ట్‌లుక్ ఫిల్మ్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ కథతో తోడేలుకు ఉన్న సంబంధం అంతర్జాతీయ మీడియాలో చర్చనీయాంశమైంది. ఇదిలావుంటే.. ముందుగా అనుకున్న ఒప్పందం ప్రకారం ఈ ఏడాది డిసెంబర్‌లో ఈ సినిమాలోని అల్లు అర్జున్ పార్ట్ మొత్తం అట్లీ పూర్తి చేయనున్నారు. సన్ పిక్చర్స్ 800కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న 'రాకా' చిత్రం 2027 డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. జనవరి నుంచి లోకేష్ కనకరాజ్ సినిమా సెట్‌లోకి బన్నీ ఎంట్రీ ఇస్తారని ఇన్‌సైడ్ టాక్.

## రష్మిక అరుదైన ఫీట్

'మైసా' సినిమా కోసం తీవ్రంగా శ్రమిస్తున్నది అగ్ర కథానాయిక రష్మిక మందన్న. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో ధైర్యసాహసాలు మూర్తీభవించిన గిరిజన మహిళగా ఆమె కనిపించనున్న విషయం తెలిసిందే. మహిళా ప్రధాన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పోరాట ఘట్టాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయని చెబుతున్నారు. ఈ సినిమా కోసం బ్యాంకాక్‌లో మార్షల్ ఆర్ట్స్‌లో ట్రెయినింగ్ తీసుకుంది రష్మిక మందన్న. డూప్‌లేకుండా స్వయంగా పోరాట ఘట్టాల్లో పాల్గొన్నది. తాజాగా ఆమె భారతీయ సినిమాలో ఇప్పటివరకూ ఎవరూ చేయని ఓ అరుదైన ఫీట్‌ని సొంతం చేసుకుంది. 'మైసా' కోసం రెండు రోజుల్లో దాదాపు 20 గంటల పాటు అత్యంత క్లిష్టమైన అండర్ వాటర్ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు. వీటిలో డూప్ లేకుండా రష్మిక స్వయంగా పాల్గొన్నది. లేడీ ఓరియెంటెడ్ చిత్రంలో కథానాయిక సొంతంగా చేసిన తొలి అండర్ వాటర్ ఫైట్ సీక్వెన్ ఇదే కావడం విశేషం. సన్నివేశాల్లో సహజత్వం కోసం రష్మిక స్వయంగా అండర్ వాటర్ ఫైట్ సీక్వెన్స్ చేసిందని, సినిమా పట్ల ఆమె అంకితభావానికి ఇదొక నిదర్శనమని మేకర్స్ పేర్కొన్నారు. త్వరలో ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాహుల్ రవీంద్రన్, ఈశ్వరీరావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, నిర్మాణం: అన్‌ఫార్ములా ఫిల్మ్స్, రచన-దర్శకత్వం: రవీంద్ర పుల్లె.



The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.